

# విభారె

## తెలుగు దినపత్రిక

## VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 19-05-2022 సంపుటి : 03 సంచిక : 241 పేజీలు : 4 వెల : రూ 3-00

# రామోజీ ఆరాటమే తప్ప రాజకీయంగా చంద్రబాబుకు కష్టమే!



తాడేపల్లి: చంద్రబాబు, దేవినేని ఉమా తొందరపాటు చర్యల వలనే డయాఫ్రంవాల్ దెబ్బతిన్నదని జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. డయాఫ్రం వాల్ డ్యామేజీ వల్లే పోలవరం పనులు కొంచెం నెమ్మదయ్యాయని అన్నారు. వారి దుందుడుకు చర్యల వలనే ఇది దెబ్బతిన్నదని కేంద్ర నిపుణులు సైతం అంగీకరిస్తున్నారన్నారు. ఈ మేరకు మంత్రి అంబటి రాంబాబు మీడియాతో మాట్లాడుతూ.. ప్రతి ఏడాది ఆగస్టులో ఇచ్చే నీటిని ఈసారి ముందుగానే ఇవ్వబోతున్నాం. జూన్‌లోనే గోదావరి, కృష్ణా బేసిన్‌లో నీటిని విడుదల చేస్తున్నాం. ఖరీఫ్‌కి రైతులు సిద్ధంగా ఉండాలి. విత్తనాలు, ఎరువులను కూడా అందుబాటులో ఉంచుతున్నాం. కాలువలకు జరుగుతున్న మరమ్మత్తు పనులు రేపటితో పూర్తవుతాయి. వ్యవసాయానికి గతంలో ఎప్పుడూ ఏ ప్రభుత్వం కూడా ఇలా నీటిని విడుదల చేయలేదు' అని అంబటి రాంబాబు అన్నారు. 'ప్రతిరోజూ ఈనాడు రామోజీరావు ప్రభుత్వంపై విషం కక్కుతున్నారు. ఎవరినో అధికారంలోకి తేవటానికి పచ్చమీడియా ప్రయత్నం చేస్తోంది. రాష్ట్రంలో 250కి పైగా పథకాలు పని చేయటం లేదని పచ్చ పత్రిక రాసింది. ఎన్నికలకు ముందు విషం కక్కితే జనం నమ్ముతారని వారి ఆలోచన. చంద్రబాబు ఏనాడైనా రైతులకు మేలు చేశారా?. ఒంటిమిట్టలో ఎత్తిపోతల పథకం పని చేస్తున్నా పనిచేయటం లేదని రాశారు. రామోజీ ఆరాటమే తప్ప చంద్రబాబు రాజకీయంగా బతకడు. శ్రీశైలం, పులిచింతల ప్రాజెక్టుల దగ్గర టీడీపీ వారు చాలా కాలంగా రిపేర్లు చేయలేదు. మన ప్రభుత్వం వచ్చాక మరమ్మత్తులు చేస్తున్నాం. చంద్రబాబు ముందస్తు ఎన్నికలంటూ కలలు కంటున్నారు. కానీ అవి నెరవేరవు. మేము ప్రజల దగ్గరకు వెళ్తుంటే వారిలో ఆనందం కనిపిస్తోంది' అని మంత్రి అంబటి రాంబాబు అన్నారు.

# పూర్తి వైఫల్యంగా జగన్ పాలన

### చంద్రబాబు



కడప కడపలో టీడీపీ అధినేత చంద్రబాబు కు టీడీపీ కార్యకర్తలు, నేతలు ఘన స్వాగతం పలికారు. తరువాత అయన కడప కార్యకర్తల సమావేశం లో పాల్గొన్నారు. చంద్రబాబు మాట్లాడుతూ 3 ఏళ్ల జగన్ పాలన పూర్తి వైఫల్యం గా సాగింది. 3 ఏళ్లలో జగన్ విధ్వంసం.... ప్రజలపై పన్నుల భారం. అందరి పై బాదుడే బాదుడు తో మోయలేని భారం. ఒంగోలులో మహానాడుకు స్టేడియం ఎందుకు ఇవ్వలేదు....మీ అబ్బ సొత్తు కాదు.? కడప ఎయిర్ పోర్టు దగ్గర కార్యకర్తలపై ఆంక్షలు పెట్టి ఇబ్బంది పెట్టారని అన్నారు.నేను ప్రజాస్వామ్య వాదిని....నేను నాడు అనుకుని ఉంటే జగన్ ఇడుపుల పాయ దాటేవారా? ప్రజల్లో తిరుగుబాటు వచ్చేసింది....దీన్ని ఇక ఆపలేరు. జగన్ లాంటి నియంతలకు నేను ఎప్పుడూ భయపడను. 3 ఏళ్ల పాలనలో... కనీసం కడపలో అభివృద్ధికి ఒక్క రూపాయి ఖర్చు పెట్టరా? ఒక్క ప్రాజెక్ట్ కట్టారా...ఒక్క పరిశ్రమ తెచ్చారా? బాదుడే బాదుడు నిరసనలు చేస్తున్నా జగన్ సిగ్గు పడడం లేదు. కర్నూల్ సోలార్ ప్రాజెక్ట్ టీడీపీ హయాం లో వచ్చింది. ఆ ప్రాజెక్ట్ విషయం లో నాపై ఆరోపణలు చేసి...ఆ కంపెనీని ఇబ్బంది పెట్టి ఇప్పుడు ప్రారంభం చేశారు. మూడేళ్ల క్రితం కర్నూల్ సోలార్ ప్రాజెక్ట్ పూర్తి అయ్యి ఉంటే ఈ రోజు పవర్ కష్టాలు ఉండేవి కాదు. చిరు వ్యాపారులు చిన్న బోర్డ్ పెట్టుకుంటే కూడా పన్నులు వేస్తున్నారు. కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి వాస్తవాలు చెప్పి ప్రభుత్వ దోపిడీని వివరించాలి. అప్పులు 8 లక్షల కోట్ల కు తీసుకు వెళ్ళారు.. అప్పుల్లోను దొంగ లెక్కలు చూపించారు. అప్పులతో జగన్ రాష్ట్ర పరువు తీశాడు...దొంగ లెక్కలు రాయడం... అడ్డంగా దొరికిపోవడం జగన్ తీరు. జగన్ నాడు రోడ్ల మీద ముద్దులు ....ఇప్పుడు ఫ్రీ గా గుద్దులు. రాష్ట్రానికి ఒక్క పరిశ్రమ రాలేదు..ఉన్నవాళ్లు వెళ్లి పోతున్నారు. జాబ్ లెస్ క్యాలెండర్ ఇచ్చారు. రాయలసీమ స్టీల్ ప్లాంట్ కు టీడీపీ ఫౌండేషన్ వేసింది...కానీ జగన్ మళ్ళీ పక్కన ఫౌండేషన్ వేసుకున్నాడు. జగన్ ఫౌండేషన్ బదులు.....ప్రారంభం చేసి ఉంటే బాగుండేదని అన్నారు.గత ప్రభుత్వం కట్టిన టాయిలెట్స్ కు కూడా రంగులు వేసుకున్న ప్రభుత్వం ఇది. సీమకు ఇరిగేషన్ ప్రాజెక్ట్ లు తెచ్చింది ఎన్టీఆర్ ప్రభుత్వం. జగన్ గండికోట నిర్వాసితులకు 10 లక్షల పరిహారం ఇచ్చారా? చిత్రావతి లిఫ్ట్ పనులు పూర్తి చేశారా? జగన్ చెప్పిన రాయలసీమ లిఫ్ట్ ఏమయ్యింది? వివేకా ను హత్య చేసి గుండెపోటు అని నమ్మించే ప్రయత్నం చేశారు. నారాసుర రక్త చరిత్ర అని నాపై బురద వేశారు. చెల్లెళ్ళ ను మోసం చేసిన వ్యక్తి జగన్ మోహన్ రెడ్డి. సీఎం అండ లేకుండా సీబీఐ అధికారుల డ్రైవర్ లను బెదిరించ గలరా? నాడు మత విద్వేషాలను, ముఠా కక్షలను పోలీసులు అణిచి వేశారు...ఇప్పుడు ఆ పోలీసులు ఏమయ్యారు? ఈ ప్రభుత్వం లో ఉద్యోగులకు, పోలీసులకు కనీసం జీతలు కూడ రావడం లేదు. ప్రజల్లో తీవ్ర బాధ, అవేదన ఉంది...గుంటూరు మహిళ వెంకాయమ్మ ప్రభుత్వం తీరును తేల్చి చెప్పింది. అలాంటి ఆమె ఇంటికి వెళ్ళి దాడి చేశారు. గ్రామాల్లో చెలరేగుతున్న సైకోలకు వడ్డీ తో సహా చెల్లిస్తా? జగన్ రాజ్యసభ ఎవరికి ఇచ్చారు...ఇద్దరు తెలంగాణ..ఇద్దరు ఆంధ్ర వాళ్ళు కు ఇచ్చారు... అంటే సమన్యాయం చేశారా. రాజ్యసభ ఇచ్చిన వాళ్ళలో ఇద్దరు టీడీపీ నుంచి వెళ్లిన వాళ్ళు. సీబీఐ కేసుల్లో వాదించిన వారికి, తనతో కేసుల్లో ఉన్న వారికి జగన్ రాజ్యసభ ఇచ్చారు. ఆంధ్ర ప్రదేశ్ లో రాజ్యసభ ఇవ్వడానికి సమర్థులు, వెనుకబడిన వర్గాల వారు లేరా? పులివెందులలో బస్ స్టాండ్ కట్టలేని వాడు మూడు రాజధానులు కడతారా? పులివెందులలో తాగునీరు ఇవ్వలేని జగన్ రాష్ట్రానికి ఏమి చేస్తాడు? అన్నమయ్య ప్రాజెక్ట్ సరిగా నిర్వహించని కారణం గా ప్రాజెక్ట్ కొట్టుకుపోయింది. ప్రాజెక్ట్ కొట్టుకు పోవడం తో మూడు ఊళ్లలో ఇళ్ళు దెబ్బతిన్నాయని అన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన సీఎం జగన్

అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం నంద్యాల జిల్లా బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కుమారుడి వివాహానికి హాజరయ్యారు. హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో కాటసాని కుమారుడు శివఓబుల్‌రెడ్డి వివాహం మేధాశ్రీతో జరుగుతోంది. ఈ కార్యక్రమానికి సీఎం జగన్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఇదిలా ఉండగా, పెళ్లి కుమార్తె మేధాశ్రీ తండ్రి పెద్ది సాయిరెడ్డి హైదరాబాద్‌లో ప్రముఖ వ్యాపారవేత్త. ఈ వివాహ వేడుకకు ఏపీ, తెలంగాణ నుంచి పలువురు ప్రముఖులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.



# బస్సు యాత్రకు సిద్ధమవుతున్న ఏపీ మంత్రులు!




అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రులు రాష్ట్రవ్యాప్త బస్సు యాత్రకు సిద్ధమవుతున్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ మంత్రులు బస్సు యాత్ర చేపట్టే యోచనలో ఉన్నారు.విశాఖ నుంచి మంత్రుల బస్సు యాత్ర ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు ఈ యాత్ర కొనసాగేందుకు అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు మరింతగా వివరించేందుకు, విస్తృత ప్రచారం చేసేందుకు బస్సు యాత్రను చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు చేయాలని ఇప్పటికే సంబంధిత మంత్రులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యమైన ప్రాంతాల్లో సమావేశాలు ఏర్పాటు చేస్తూనే యాత్రను కొనసాగించేలా రూట్ మ్యాప్‌ను ఇప్పటికే సిద్ధం చేశారు.

# బీసీలకు పెద్ద పీట కాదు.. అసలు బీసీల వెన్నెముక విరగ్గొట్టిందే వైసీపీ

### టీడీపీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడు కౌంటర్

అమరావతి మే 18 రాజ్యసభ అభ్యర్థుల కేటాయింపులో తాము బీసీలకు పెద్ద పీట వేశామన్న వైసీపీ వాదనకు టీడీపీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడు కౌంటర్ ఇచ్చారు. అసలు బీసీల వెన్నెముక విరగ్గొట్టిందే వైసీపీ అంటూ విరుచుకుపడ్డారు. సీఎం సీటులోంచి జగన్ పక్కకు తప్పుకొని, బీసీలకు సీఎం సీటు ఇవ్వగలరా? అంటూ యనమల సూటిగా ప్రశ్నించారు.వైసీపీలో సీఎం జగన్ ఓ వర్గానికే అధిక ప్రాధాన్యం ఇస్తూ? బీసీలను అణగదొక్కుతున్నారని, ఇది నిజం కాదా? అంటూ నిలదీశారు. తమ పార్టీలో బీసీ నేతలమైన అచ్చన్నాయుడు, తాను, అయ్యన్న పాత్రుడో మాట్లాడతామని, వైసీపీలో ప్రతి దానికీ ఎవరు మాట్లాడతారో ప్రజలకు తెలుసంటూ పరోక్షంగా సజ్జలను విమర్శించారు. సజ్జల, విజయసాయి రెడ్డి, వైవీ లాంటి వారికే వైసీపీలో ప్రాధాన్యముంటుందన్నారు.టీడీపీ అంటేనే బీసీల పార్టీ అని యనమల స్పష్టం చేశారు.



సీఎం జగన్ రాజ్యసభకు నామినేట్ చేసిన ఆర్. కృష్ణయ్య, మస్తాన్ రావు టీడీపీ నుంచి వెళ్లిన వారేనని గుర్తు చేశారు. వైసీపీలో బీసీ నేతలెవ్వరూ లేరు కాబట్టే, ఇతర పార్టీల నుంచి వెళ్లిన వారికి ప్రాధాన్యమిస్తున్నారని ఎద్దేవా చేశారు. బీసీలకు పదవులు ఇవ్వడం మంచిదే గానీ? ప్రాధాన్యం లేని పదవులు దక్కుతున్నాయని యనమల విమర్శించారు.

# గుజరాత్‌లో ఘోర ప్రమాదం..

### 12 మంది దుర్మరణం



అహ్మదాబాద్ : గుజరాత్‌లోని మోర్బి జిల్లాలో ఘోర ప్రమాదం జరిగింది. హల్వాడ్‌లోని సాగర్ ఉప్పు ఫ్యాక్టరీ గోడ కూలి.. 12 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. పలువురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. క్షతగాత్రులను సమీప ఆస్పత్రికి తరలించారు. శిథిలాల తొలగింపు కొనసాగుతోంది. శిథిలాల కింద మరికొందరు చిక్కుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని గుజరాత్ మంత్రి బ్రిజేష్ మెర్జా పేర్కొన్నారు.

ప్రధాని మోదీ తీవ్ర దిగ్భ్రాంతి

సాగర్ ఉప్పు ఫ్యాక్టరీ గోడ కూలిన ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం ప్రకటించారు. మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షల చొప్పున, క్షతగాత్రులకు రూ. 50 వేల చొప్పున పరిహారం ప్రకటించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.

# రాజీవ్ గాంధీ హత్య కేసులో నిందితుడికి ఊరట

### ఏజీ పెరారివాలన్ ను విడుదల చేయాలని సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ మే 18 మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ హత్య కేసులో నిందితుడు ఏజీ పెరారివాలన్‌కు ఊరట లభించింది. అతన్ని విడుదల చేయాలని ఇవాళ సుప్రీంకోర్టు తన ఆదేశాల్లో పేర్కొన్నది. 31 ఏళ్ల తర్వాత పెరారివాలన్ జైలు జీవితానికి గుడ్‌బై చెప్పనున్నాడు. జస్టిస్ ఎల్ నాగేశ్వర రావు, బీఆర్ గవాయి, ఏఎస్ బొప్పన్నలతో కూడిన ధర్మాసనం ఈ ఆదేశాలు జారీ చేసింది. రాజ్యాంగంలోని 142 అధికరణ ద్వారా ధర్మాసనం ఈ ఆదేశం చేసింది. ఆర్టికల్ 161 కింద పెరారివాలన్‌ను విడుదల చేయాలని పెట్టుకున్న అభ్యర్థనపై తమిళనాడు గవర్నర్ తన నిర్ణయాన్ని తీసుకోవడం జాప్యం చేస్తున్నట్లు సుప్రీం పేర్కొన్నది. పెరారివాలన్ రిలీజ్‌కు రాష్ట్ర క్యాబినెట్ అంగీకరించిందని, ఇక ఆర్టికల్ 142 ప్రకారం ఆ నిందితుడిని రిలీజ్ చేయడం సమంజసమే అని సుప్రీం అభిప్రాయపడింది.రాజీవ్ గాంధీ హత్యకు వాడిన బాంబు పరికరాలను పెరారివాలన్ అందజేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. రాజీవ్ హత్య సమయంలో పెరారివాలన్ వయసు 19 ఏళ్లు. ఈ కేసులో అతను దోషిగా తేలాడు. 1998లో అతనికి మరణశిక్షను ఖరారు చేశారు. ఆ తర్వాత 2014లో సుప్రీం ఆ శిక్షను జీవితకాల శిక్షగా మార్చింది. ఇక ఈ ఏడాది మార్చిలో సుప్రీంకోర్టు అతనికి బెయిల్‌ను మంజూరీ చేసింది.

# భారత దేశం చాలా వరకు శ్రీలంకలా ఉంది : రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ : దేశంలో ద్రవ్యోల్బణం , నిరుద్యోగం పెరుగుతుండటంతో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భారత దేశం చాలా వరకు శ్రీలంకలా కనిపిస్తోందని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం ప్రజల దృష్టిని మళ్ళించకూడదన్నారు. ప్రజల దృష్టిని మళ్లించడం వల్ల వాస్తవాలు మారబోవని అన్నారు. రాహుల్ గాంధీ బుధవారం ఇచ్చిన ట్వీట్‌లో, "ప్రజల దృష్టిని మళ్లించడం వల్ల వాస్తవాలు మారబోవు. భారత దేశం చాలా వరకు శ్రీలంక మాదిరిగా కనిపిస్తోంది" అని పేర్కొన్నారు. ఈ ట్వీట్‌కు ఆయన మూడు గ్రాఫ్‌లను జత చేశారు. ఇరు దేశాల్లో నిరుద్యోగం, పెట్రోలు ధరలు, మత హింసకు సంబంధించిన గ్రాఫ్‌లను జత చేశారు. సాయుధ సంఘర్షణ ప్రాంతాలు, ఈవెంట్ డేటా ప్రాజెక్ట్, లోక్‌సభ అన్‌స్టార్డ్ ప్రశ్నలు, సీఎంఐఈ, పెట్రోలియం ప్లానింగ్ అండ్ అనాలసిస్ సెల్, శ్రీలంక సెంట్రల్ బ్యాంక్ వెల్లడించిన సమాచారం ఆధారంగా ఈ గ్రాఫ్‌లను రూపొందించినట్లు తెలిపారు. ఇదిలావుండగా, కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ తీవ్రంగా మండిపడుతున్న సంగతి తెలిసిందే.

# రాష్ట్రంలో ఒక కుట్ర జరుగుతోంది: బొత్స

విజయనగరం: పార్టీని మరింత అభివృద్ధి చేయాల్సిన బాధ్యత జిల్లా అధ్యక్షులకు, జిల్లా మంత్రులకు వుందని మంత్రి బొత్స సత్యానారాయణ అన్నారు. గత ప్రభుత్వంలో అనేక అవినీతి కార్యకలాపాలు జరగబట్టే అధికారంలోకి వచ్చామన్నారు. ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో ప్రతి ప్రభుత్వ కార్యక్రమం అధికారులు నిర్వహించాలని చెప్పారు. రెండోసారి అధికారంలోకి రావడం కోసం మొదటిసారి ఎన్నికైన ప్రతి నాయకుడు కష్టపడాలని సూచించారు. పార్టీ కోసం కష్టపడిన వారికి అధిష్టానం వద్ద గుర్తుంపు ఉంది వారికే పార్టీ పదవులని పేర్కొన్నారు. అలాగే రేపటి నుంచి లచ్చయ్యపేట షుగర్ ఫ్యాక్టరీ బకాయిలు చెల్లింపులు జరుగుతాయన్నారు. ఎన్.ఆర్.జిఎస్ నిధుల బకాయిలను ఈ నెల ఆఖరిలోగా ప్రభుత్వం విడుదల చేస్తుందని తెలిపారు. ఈ రాష్ట్రానికి జగన్మోహన్ రెడ్డి నాయకత్వం చాలా అవసరమన్నారు. రాష్ట్రంలో ఒక కుట్ర జరుగుతోందని, బలహీన వర్గాలను అనిచెందుకు ప్రతి పక్షం పావులు కదుపుతోందన్నారు.

# తీరిన బొగ్గు కొరత.. ఏపీలో ఇక నిరంతరాయ విద్యుత్ సరఫరా

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా కానుంది. మరోవైపు పరిశ్రమలకు విద్యుత్ కోతల వేళలు ఉపసంహరించుకుంటున్నట్లు ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది.మే 9 నుంచి పరిశ్రమలకు పవర్ హాలిడే ఉపసంహరణ కొనసాగుతోందని ప్రభుత్వం తెలిపింది. అలాగే ఈ నెల 16వ తేదీ నుంచి పరిశ్రమలకు పూర్తి స్థాయిలో విద్యుత్ సరఫరా ఇస్తున్నట్లు పేర్కొంది. దేశవ్యాప్తంగా ఉన్న బొగ్గు కొరత వలన కొద్దిరోజుల పాటు పరిశ్రమలకు విద్యుత్ పంపిణీ లో సమస్యలు తలెత్తాయని, ప్రస్తుతం పరిస్థితి మెరుగుపడటంతో అన్ని రంగాల వినియోగదారులకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయనున్నట్లు ఏపీ ప్రభుత్వం తెలిపింది.



# సంపాదకీయం

గురువారం 19-05-2022

## జలజగడాలకు ఫుల్ స్టాప్ ఎప్పుడు

భారతదేశంలోని అత్యంత పొడవైన నదులలో కృష్ణా నది మూడవది. దక్షిణ భారతదేశంలో రెండో పెద్ద నది. నీటి ప్రవాహం సెకనుకు 2213 మీ. నీటి ప్రవాహంపరంగా దేశంలో నాలుగవ పెద్ద నది. మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల గుండా 1,400 కి. మీ. ప్రయాణించి హంసలదీవి వద్ద బంగాళాఖాతంలో కలుస్తుంది. మొత్తం పరీవాహక ప్రాంతం 2,56,000 చ.కి.మీ. ఇందులో నాలుగు పరీవాహక రాష్ట్రాల వాటా మహారాష్ట్ర: 26.8%, కర్ణాటక: 43.8%, తెలంగాణ : 20.0%,ఆంధ్రప్రదేశ్ : 9.4%.గా ఉంది.తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి ముందు నుంచి కూడ కృష్ణా, గోదావరి జలాల పంపిణీపై వివాదాలు కొనసాగుతూనే ఉన్నాయి, ఇందులో ప్రధానంగా కృష్ణా నదీ జలాల వివాదాలు ఇప్పటికీ కూడ ఒక కొలిక్కి రాలేకపోగా, మరింతగా ముదురుతున్నాయి, మొదటి నుంచి కృష్ణా జలాలను తరలించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రయత్నిస్తూనే ఉంది. వాటిని అడ్డుకునేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర నీటిపారుదల శాఖ మంత్రిత్వ శాఖకు పది సార్లు ఫిర్యాదు చేసింది. సాక్షాత్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ ఢిల్లీకి వెళ్లి జలశక్తి శాఖ మంత్రి గజేంద్ర షెఖవత్‌ను కలిసినప్పటికీ ఫలితము లేదు, బోర్డులు, నోటిఫికేషన్ల పేరుతో కాలయాపన తప్ప తెలంగాణ ప్రజలకు ఒరిగిందేమీ లేదుఅంతర్జాతీయ నదీ నియమాలలోని ఒక సూత్రం ప్రకారం ముందు నుంచి వాడుకుంటున్న వారికి మొదటి హక్కు ఇవ్వాలి. దాన్నే 'ఫస్ట్ ఇన్ యూజ్, ఫస్ట్ ఇన్ రైట్' అంటారు. బచావత్ ట్రిబ్యునల్ తీర్పు ప్రకారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కృష్ణా నీళ్లు కర్ణాటక కంటే ఎక్కువగానే వచ్చాయి. సహజ నదీ సూత్రాల ప్రకారం, కృష్ణా నది, దాని ఉప నదులు ఎక్కువగా ప్రవహించే కర్ణాటకకే సహజంగా ఎక్కువ నీటి కేటాయింపులు జరగాలి. కానీ 'ఫస్ట్ ఇన్ యూజ్...' సూత్రం ప్రకారం తమకు పూర్తి కేటాయింపులు ఇవ్వాలని ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ వాదించి సాధించుకుంది, ఈ రకమైన తతంగం మొదటి నుంచి నేటి వరకు జరుగుతూనే ఉంది. ఇది సహజ సూత్రాలకు విరుద్ధమని తెలంగాణ వాదిస్తున్నది.సహజ జల సూత్రాలలో బేసిన్ నిబంధన ప్రామాణికంగా తీసుకుంటే తెలంగాణకు న్యాయం జరిగే అవకాశం ఉంటుంది. మొదటి వినియోగదారు నిబంధన ప్రామాణికంగా తీసుకుంటే కోస్తాకు, రాయలసీమకు భారీ మేలు జరుగుతోంది. కాబట్టి బేసిన్ రూల్ కోసం ఇటూ తెలంగాణ, ఫస్ట్ యూజర్ రూల్ కోసం అటు ఆంధ్రప్రదేశ్ పోటాపోటీగా పట్టుబడుతున్నాయి. దీనికి కర్ణాటక, మహారాష్ట్ర ఒప్పుకోలేదు. విడిపోయిన రెండు రాష్ట్రాలూ వాటి మధ్య పంపకాల సంగతి చూసుకోవాలి తప్ప, మొత్తం నది నీళ్లు తిరిగి పంపకాలు చేయడం కుదరదంటున్నాయి. ఇదే విషయాన్ని బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ముందుకు కూడా తీసుకెళ్లాయి.మొదటి నుంచి అసలే కృష్ణా బేసిన్‌లో ఏ మాత్రంలేని కృష్ణా డెల్టా ఆయకట్టు, నాగార్జున సాగర్ కుడి కాలువ ఆయకట్టు, కేసీ కెనాల్ ఆయకట్టు ప్రాంతాలకు నీటిని వినియోగిస్తున్నారు, ఈ నీటి కేటాయింపులు జరగడంలో ఔచిత్యం ఏమిటో అర్థం కావడం లేదు. పైగా కృష్ణా బేసిన్‌లో ఉండే తెలంగాణ ప్రాంతాలు ఎండుతుండగా, కృష్ణా బేసిన్‌లో లేని రాయలసీమకు నీరు ఇవ్వడం కోసం పోతిరెడ్డిపాడు సామర్థ్యం పెంపు సరికాదని తెలంగాణ వాదన. ఇక తెలుగుగంగ చెన్నయికి నీరు ఇచ్చేదే అయినప్పటికీ ఆ కాలువ ఆధారంగా వెలిగోడు, కండలేరు, సోమశిల వంటి రిజర్వాయర్లు నిర్మించి వాటిని అక్రమంగా నింపి రాయలసీమకు శ్రీశైలం నీటిని మళ్లిస్తున్నారని తెలంగాణ ఆరోపిస్తోంది.అసలు చెన్నయికి ఇస్తామన్న నీరు కూడా ఇవ్వకుండా ఆ వంకతో రాయలసీమ ప్రాజెక్టులు నింపుకుంటూ తమకు అన్యాయం చేస్తున్నారని తెలంగాణ వాదన. దీంతో అటు పులించింతల, ఇటు పట్టిసీమ వలన కృష్ణా డెల్టా రైతులకు సాగునీటికి భరోసా దక్కింది. రాయలసీమ, తెలంగాణ వివాదం అలానే ఉండిపోయింది.రాయలసీమలో చాలా భాగం పెన్నా బేసిన్‌లో ఉంటుంది. కృష్ణా బేసిన్ గల తెలంగాణకు నీరు ఇవ్వకుండా, కృష్ణా బేసిన్ పరిధిలో లేని రాయలసీమకు ముందుగా నీరు ఇవ్వడాన్ని తెలంగాణ వ్యతిరేకిస్తుంది.తెలంగాణ విడిపోక ముందే జరిగిన కృష్ణా జలాల నీటి పంపకం విడిపోయాక కూడా యథాతథంగా కొనసాగించడం న్యాయం ఎలా అవుతుంది? న్యాయబద్ధమైన ఈక్విటబుల్ డిస్ట్రిబ్యూషన్ నీటి వాటా ఇవ్వడమో? లేదా కొత్త ట్రిబ్యునల్ ఏర్పాటు చేయడమో జరగాలని రాష్ట్రం కేంద్రాన్ని కోరినా స్పందన లేదు. బచావత్ ట్రిబ్యునల్ ముందు చూపుతో గంపగుత్తగా 811 టీఎంసీల నీటిని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించి, అందులో ఆంధ్రప్రదేశ్‌కు 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీల నీరు వినియోగానికి అవకాశం ఇచ్చింది.46 ఏండ్ల క్రితం జరిపిన కేటాయింపులనే నేటికీ యథాతథంగా జరగాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కోరడం ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధం.బచావత్ ట్రిబ్యునల్స్ ,బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ముందు అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పక్షపాత ధోరణితో తెలంగాణ అవసరాలను దాచిపెట్టి, కేవలం కోస్తాంధ్ర, రాయలసీమ అవసరాల గురించి మాత్రమే వాదనలు వినిపించి 100% బేసిన్‌లో ఉండి, కరువుతో సాగునీటికి, తాగునీటికి అవస్థలకు గురవుతున్న మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల కనీస ప్రస్తావన లేనందున తెలంగాణ ప్రాజెక్టులకు నికర జలాల కేటాయింపులో స్థానం లేకుండా పోయింది.శ్రీశైలం జలాశయం నీటిని నాగార్జునసాగర్ ఆయకట్టు అవసరాలకు, హైదరాబాద్ తాగునీటికి వదలడానికి ఏపీ ప్రభుత్వం సమ్మతించడం లేదు. మహబూబ్‌నగర్ జిల్లాకి 142 టీఎంసీల నీరు కేటాయించారు.జూరాల, రాజోలిబండ, బీమా ప్రాజెక్టులకు మాత్రమే జలాల కేటాయింపు ఉండగా నెట్టెంపాడు కల్వకుర్తి పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులకు నికర జలాల కేటాయింపులు లేనేలేవు. నల్గొండ జిల్లాకు 135 టీఎంసీల నికర జలాలు ఉన్నప్పటికీ, నాగార్జునసాగర్ ఎడమ కాలువకు 105, మూసీ ప్రాజెక్టుకు 9.4 టీఎంసీలు మాత్రమే కేటాయించారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన ఏఎన్ఆర్‌పీ, డిండి ప్రాజెక్టులకు నికర జలాల కేటాయింపులు లేకపోవడం, పాలమూరు రంగారెడ్డి డిండి ప్రాజెక్టు లకు విభజనకు ముందే ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వము ప్రారంభించినప్పటికీ, దానికి కూడా ప్రత్యేక అనుమతులు ఉండాలని ఆంధ్ర ప్రభుత్వం కోరడం మూర్ఖత్వం కాదా? తెలంగాణకు కృష్ణా గోదావరి నదులు తప్ప వేరే ఆధారం లేదు తెలంగాణలో బేసిన్ 68 శాతం ఉండగా ఆంధ్రప్రదేశ్‌లో 32 శాతం మాత్రమే ఉందనే విషయాన్ని మర్చిపోవద్దు. ఆంధ్రప్రదేశ్ 80 శాతానికిపైగా ఇతర నదులపై ఆధారపడి ఉంది. కోస్తాంధ్రలో వర్షపాతం ఎక్కువ. భూగర్భ జలాల లభ్యత కూడా అధికము, వరద జలాల, అదనపు జలాల వినియోగంలో కూడా ఆంధ్రప్రదేశ్ దిగువన ఉండటం కూడా అంశం కలిసొచ్చే అంశం.

## 20 నుంచి వేరు సెనగ



అనంతపురం, మే 18, ఖరీఫ్ సీజన్ కోసం నాణ్యమైన, ధ్రువీకరించిన వేరుశనగ విత్తనాలను ఈ నెల 20వ తేదీ నుంచి రైతుభరోసా కేంద్రాల (ఆర్బీకేల) ద్వారా పంపిణీ చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. కె?6, నారాయణి, కదిరి లేపాక్షి (కె?1812) రకాల విత్తనాలను 40 శాతం సబ్సిడీ పోను కిలో రూ.51.48కి రైతులకు ఇచ్చేందుకు సిద్ధం చేసింది. గత సీజన్‌లో మాదిరిగానే ఈ విత్తనాల్లో మూడోవంతును సొంతంగా అభివృద్ధి చేసిన వాటినే పంపిణీ చేయనుంది.ఖరీఫ్‌లో వేరుశనగ సాధారణ సాగువిస్తీర్ణం 17.90 లక్షల ఎకరాలు కాగా గతేడాది 18.50 లక్షల ఎకరాల్లో సాగైంది. 5.40 లక్షల టన్నుల దిగుబడులొచ్చాయి. వేరుశనగ కనీస మద్దతు ధర రూ.5,550 కాగా గతేడాది రూ.6,500 వరకు పలికింది. ఈ ఏడాది రూ.6,800 నుంచి రూ.7 వేల వరకు పలుకుతోంది.ఈ ఏడాది సాగు లక్ష్యం 18.40 లక్షల ఎకరాలు కాగా, మార్కెట్‌లో ఎమ్మెస్పీకి మించి ధర లభిస్తుండడంతో ఈసారి కూడా లక్ష్యానికి మించే సాగయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. రాయలసీమతో పాటు రాష్ట్రవ్యాప్తంగా రైతులు వరికి ప్రత్యామ్నాయంగా అపరాలు, చిరుధాన్యాలతో పాటు వేరుశనగ సాగుపై ఆసక్తి చూపిస్తున్నారుసబ్సిడీ విత్తనం కోసం గతంలో పూర్తిగా ప్రైవేటు కంపెనీలపైనే ఆధారపడే వాళ్లు. కంపెనీలు ఏ విత్తనం ఇస్తే దాన్నే సబ్సిడీపై పంపిణీ చేయాల్సి వచ్చేది. ఈ పరిస్థితికి చెక్ పెడుతూ కనీసం మూడోవంతు విత్తనమైనా సొంతంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో గత సీజన్ నుంచి సొంత విత్తన తయారీకి శ్రీకారం చుట్టారు. రబీ 2020?21లో ఉత్పత్తి చేసిన విత్తనాన్ని రైతుల నుంచి కొనుగోలు చేసి, ఆ తర్వాత సర్టిఫై చేసి ఖరీఫ్?2021లో పంపిణీ చేశారు.గడిచిన రబీ 2021?22లో ఉత్పత్తి చేసిన విత్తనాన్ని అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లలో సర్టిఫై చేసి ఖరీఫ్ సీజన్ కోసం సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం పంపిణీ చేయనున్న 3,95,761 క్వింటాళ్ల విత్తనాల్లో.. లక్ష క్వింటాళ్లు రబీలో రైతులు ఉత్పత్తి చేసినవే. టెండర్ల ద్వారా ప్రైవేటు కంపెనీల నుంచి సమీకరించే మిగిలిన విత్తనాన్ని సైతం ర్యాండమ్‌గా అగ్రి ల్యాబ్స్‌లో సర్టిఫై చేసిన తర్వాతే ఆర్బీకేల ద్వారా పంపిణీ చేయనున్నారు. ఈనెల 20వ తేదీ నుంచి ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్లు ప్రారంభిస్తారు. అదేరోజు నుంచి కిలో రూ.85.80 ధర ఉన్న విత్తనాలను 40 శాతం సబ్సిడీ పోను రూ.51.48కి రైతులకు పంపిణీ చేయనున్నారు.

## పెరిగిన ధరలతో తాండ్ర వ్యాపారుల విలవిల



కాకినాడ, మే 18, రుచికి.. శుచికి.. తియ్యని మామిడి తాండ్రకు కేరాఫ్ అడ్రస్‌గా ఆత్రేయపురం పేరు గాంచింది. చుట్టూ పచ్చని పొలాలు.. ప్రశాంత వాతావరణానికి నెలవైన ఈ గ్రామం తాండ్ర తయారీలో ప్రసిద్ధి పొందింది. అనేక మంది ప్రజలు దీనినే వృత్తిగా మార్చుకుని జీవనోపాధి పొందుతున్నారు. తియ్యని లాభాలు ఆర్జిస్తున్నారు. ఏటా వేసవి వచ్చిందంటే తాండ్ర తయారీలో ప్రజలు నిమగ్నమవుతుంటారు. సుమారు 500 కుటుంబాల వారు ఏప్రిల్, మే, జూన్ నెలల్లో తాటి చాపలపై మామిడి తాండ్ర పూస్తుంటారు. ఈ మూడు నెలలూ అనేక మందికి జీవనోపాధి కలి?పస్తుంటారు. ఇప్పుడు తయారు చేసిన తాండ్రను నిల్వ ఉంచి, ఏడాది పొడవునా విక్రయిస్తుంటారు.ప్రస్తుత సీజన్‌లో ఆత్రేయపురం కేంద్రంగా సుమారు రూ.66 లక్షల విలువైన 60 టన్నుల మామిడి తాండ్ర తయారవుతోంది. దీని తయారీకి అవసరమైన మామిడి కాయలను నూజివీడు, సత్తుపల్లి, కోరుకొండ, గోకవరం, తుని, తాడేపల్లిగూడెం తదితర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. ప్రధానంగా కలెక్టర్ రకం మామిడినే తాండ్ర తయారీకి వాడుతుంటారు. ఆత్రేయపురానికి రోజూ రెండు లారీల చొప్పున మామిడి కాయలు తీసుకొస్తుంటారు. దిగుమతి చేసుకున్న మామిడి కాయలను కావు వేసి పండ్లుగా తయారు చేస్తారు.పండిన మామిడి నుంచి గుజ్జు తీస్తారు. ఆ గుజ్జులో తగు పాళ్లలో పంచదార కలుపుతారు. తర్వాత ఎండలో ఉంచిన తాటి చాపలపై కూలీల సాయంతో ఒక్కో పొరను పూస్తారు. ఇలా రోజుకు ఒక్కో పొర చొప్పున ఐదారు పొరలు పూసిన అనంతరం మామిడి తాండ్ర తయారవుతుంది. మామిడి తాండ్ర పూసిన తాటి చాపలు వారం రోజుల పాటు ఎండలో ఆరబెడతారు. దీనివల్ల ఎక్కువ కాలం నిల్వ ఉంటుంది. అనంతరం ఆరంగుళాల పొడవు, వెడల్పు ఉండేలా ముక్కలు కోసి తిరిగి ఎండబెట్టి విక్రయాలకు సిద్ధం చేస్తారు. ప్రస్తుతం ఉన్న మామిడి ధరలతో తాండ్ర తయారీ తలకు మించిన భారంగా మారిందని తయారీదారులు వాపోతున్నారు.ప్రస్తుతం మామిడి దిగుబడి అంతంత మాత్రంగానే ఉండటంతో ధరలు విపరీతంగా పెరిగాయి. టన్ను మామిడి కాయల ధర రూ.18 వేలు, పంచదార క్వింటాల్ రూ.3,800 పలుకుతుండటంతో రూ.లక్షల్లో పెట్టుబడులు పెట్టాల్సి వస్తుందని వ్యాపారులు అంటున్నారు. దీంతో సామాన్యులు మామిడి తాండ్ర తయారీకి ముందుకు వెళ్లే పరిస్థితులు లేవని తయారీదారుడు కఠారి సురేష్ 'సాక్షి'కి తెలిపారు. టన్ను మామిడి కాయలతో 250 కిలోల తాండ్ర తయారవుతుండగా.. ప్రస్తుత ధరల ప్రకారం, కూలీల ఖర్చులతో కలసి సుమారు రూ.25 వేల వరకూ అవుతోంది. ఈ పరిస్థితుల్లో కిలో తాండ్రను రూ.150 నుంచి రూ.200 వరకూ అమ్మితేనే గిట్టుబాటు అవుతుందని వ్యాపారులు చెబుతున్నారు.ఆత్రేయపురంలో తయారైన మామిడి తాండ్ర రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు ఇతర దేశాలకూ ఎగుమతి చేస్తున్నారు. ఇలా గ్రామానికి అంతర్జాతీయంగా పేరు తెస్తున్నారు. శ్రమనే దైవంగా నమ్ముకుని ఆత్రేయపురం పరిసర ప్రాంతాల ప్రజలు మామిడి తాండ్ర తయారీలో నిమగ్నమవుతున్నారు. లాభాలు ఆర్జించడంతో పాటు గ్రామానికి గుర్తింపు తీసుకురావడంలో తమ వంతు పాత్ర పోషిస్తున్నారు.మామిడి తాండ్ర పుట్టిన ప్రాంతంగా ఆత్రేయపురం ఖ్యాతికెక్కింది. వేసవిలో టన్నుల కొద్దీ మామిడి కాయలను కొనుగోలు చేసి, తాండ్ర తయారు చేస్తారు. దీనిని వివిధ ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు. ఈ ఏడాది మామిడికాయలు తక్కువ రావడంతో రేటు కూడా ఎక్కువగా ఉంది. తాండ్ర తయారు చేసిన కష్టానికి తగిన ఫలితం దక్కకపోవచ్చు.

## బీసీ ఓట్లు..వయా కృష్ణయ్య

విజయవాడ, మే 18, వచ్చే ఎన్నికల్లో బీసీల ఓట్లను కొల్లగొట్టేందుకు ఏపీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి మరో ఎత్తుగడ వేశారు. జాతీయ బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యను ఏపీ తరఫున రాజ్యసభకు పంపిస్తున్నారు. ఈ మేరకు మంగళవారం మధ్యాహ్నం రాజ్యసభ ఎంపీ విజయసాయిరెడ్డి, టీటీడీ ఛైర్మన్ వైవీసుబ్బారెడ్డి, మంత్రి బొత్స సత్యనారాయణలతో చర్చించి, అభ్యర్థుల జాబితాను ఖరారు చేశారు. ఈ నెలాఖరులో ఖాళీ అయ్యే నాలుగు స్థానాలకు విజయసాయిరెడ్డి, బీద మస్తాన్ రావు, నిరంజన్ రెడ్డి, ఆర్. కృష్ణయ్యపేర్లను ఖరారు చేసినట్లు మంత్రి బొత్స సత్యనారాయణ ప్రకటించారుఅయితే.. ఆర్.కృష్ణయ్య జగమెరిగిన బీసీ నేత. బీసీల సంక్షేమం కోసం జాతీయ స్థాయిలో కూడా అనేక ఉద్యమాలు చేశారు. అలాంటి బీసీ పెద్ద ఆర్.కృష్ణయ్యను వైసీపీ అధినేత నేరుగా రాజ్యసభకు పంపాలనే నిర్ణయం తీసుకోవడం వెనుక జగన్ రెడ్డి రాజకీయ ఎత్తుగడ ఉందని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. అయితే.. తెలంగాణకు చెందిన కృష్ణయ్యను పనిగట్టుకుని ఏపీ తరఫున ఊహించని విధంగా అందలం ఎక్కించాలనుకోవడంతో పలువురిలో ఆశ్చర్యం కలుగుతోంది. తాడేపల్లిలోని సీఎం జగన్ క్యాంపు ఆఫీసులో జగన్ తో మంగళవారంనాడు ఆర్. కృష్ణయ్య భేటీ అయ్యారు. ఈ క్రమంలోనే ఏపీ నుంచి రాజ్యసభకు పంపించేవారి జాబితాను జగన్ ఫైనల్ చేశారంటున్నారు.ఏపీ నుంచి రాజ్యసభకు ఏర్పడే నాలుగు ఖాళీలకు సంబంధించిన షెడ్యూల్ కూడా కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. ముందుగా వచ్చిన వార్తల ప్రకారం ఏపీ నుంచి రాజ్యసభకు విజయసాయిరెడ్డిని కొనసాగించడంతో పాటు నెల్లూరుకు చెందిన పారిశ్రామికవేత్త, మాజీ టీడీపీ నేత బీద మస్తాన్ రావును కన్ఫం చేశారని అన్నారు. మరో అభ్యర్థిగా ఉత్తరాంధ్రకు చెందిన బీసీ మహిళ, మాజీ కేంద్ర మంత్రి కిల్లి కృపారాణికి ఛాన్స్ ఇస్తారనే వార్త రాజకీయ వర్గాల్లో హల్ చల్ చేసింది. మరో స్థానాన్ని గుజరాత్ కు చెందిన పారిశ్రామికవేత్త అదాని సతీమణికో లేక ఆయనకో కేటాయించారని గతంలో వార్తలు వచ్చాయి. మరో స్థానంలో న్యాయవాది నిరంజన్ రెడ్డి పేర్లు వినిపించాయి. కాగా.. తాజా పరిణామంలో నాలుగోస్థానంలో కిల్లి కృపారాణికి బదులు బీసీ నేత ఆర్.కృష్ణయ్యను రాజ్యసభకు పంపిస్తుండడం విశేషం.బీసీ ఓట్ల కోసం జగన్ గాలం వేయడమే కాకుండా ఇక్కడ గమనించాల్సిన మరో అంశం ఉంది. ఇంతకు ముందు ఆర్.కృష్ణయ్య కూడా తెలుగుదేశం పార్టీ నుంచి తెలంగాణలో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. బీద మస్తాన్ రావు కూడా టీడీపీ మాజీ నేతే కావడం గమనార్హం. మస్తాన్ రావుతో పాటు ఆర్. కృష్ణయ్యను పెద్దల సభకు పంపించాలనే జగన్ నిర్ణయం వెనుక టీడీపీని దెబ్బతీయాలనే కుటిల యత్నం ఉందని రాజకీయ వర్గాల్లో ఊహాగానాలు వస్తున్నాయి.బీసీ సమస్యలపై ఆర్.కృష్ణయ్య ఎన్నో ఉద్యమాలు నిర్వహించారు. అప్పటి ఏపీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డికి కృష్ణయ్య ఎంతో చేరువగా ఉండేవారు. వైఎస్సార్ దృష్టికి తీసుకెళ్లి ఎన్నో సమస్యలు పరిష్కారం అయ్యేలా చేశారు. అయితే.. రాష్ట్ర విభజన తర్వాత ఆర్.కృష్ణయ్య తెలంగాణకే పరిమితం అయ్యారు. అలాంటి ఆర్.కృష్ణయ్యను ఏపీ నుంచి రాజ్యసభ పంపడం ద్వారా బీసీ ట్రంప్ కార్డును తెరమీదకు తీసుకురావాలనే ఎత్తుగడ వైఎస్ జగన్ వేశారంటున్నారు. ఆర్.కృష్ణయ్యను ఎంపిక చేయడం జగన్ తీసుకున్న వ్యూహాత్మక నిర్ణయమే అంటున్నారు.

## మరో వివాదంలో అనిల్ యాదవ్

నెల్లూరు, మే 18, నెల్లూరులో కొత్త వివాదం మొదలైంది. రియల్ ఎస్టేట్ వెంచర్ల వివాదం పొలిటికల్ కలర్ పులుముకుంటోంది. ఈ పొలిటికల్ లేఔట్స్ వివాదం మాజీ మంత్రి అనిల్ యాదవ్ టార్గెట్‌గా సాగుతోంది. ఆయనగా మంత్రిగా ఉన్న మూడేళ్ల కాలంలో లేఔట్స్ మంజూరులో 3వేల కోట్ల రూపాయల అక్రమాలకు పాల్పడ్డారని టీడీపీ నేతలు ఆరోపించారు. తన సహచరుడు, మాజీ కార్పొరేటర్ కిన్నెర ప్రసాద్ అనే వ్యక్తి ద్వారా అనిల్ అక్రమ లేఔట్స్ వేయిస్తున్నారని టీడీపీ ఆరోపిస్తోంది. ఈ వెంచర్లలో అనిల్ బినామీగా ఉన్నారని టీడీపీ అంటోంది. ఈ అక్రమ వ్యవహారాల ద్వారా ఖజానాకు 200 కోట్ల రూపాయల నష్టం వాటిల్లిందని టీడీపీ నేతలు ఫిర్యాదు చేసారు. అక్రమ లేఔట్స్ వ్యవహారంలో లోకేశ్ ట్వీట్ చేసిన వెంటనే నెల్లూరు జిల్లా టీడీపీ నేతలు నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్‌ఛైర్మన్‌కు ఫిర్యాదు చేశారు. తాజాగా నెల్లూరు శివారు ఎన్టీఆర్ నగర్‌లో వేస్తున్న లేఔట్ వివాదాస్పదమవుతోంది. నుడా వైస్ ఛైర్మన్‌ను కలిసిన మాజీ నుడాఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి కలిసి అనిల్ యాదవ్‌పై ఫిర్యాదు చేశారు.లోకేశ్ ట్వీట్‌పై మాజీ మంత్రి అనిల్ యాదవ్ తీవ్రస్థాయిలో స్పందించారు. టీడీపీ నేతలు చాలా మంది తమతో టచ్‌లో ఉన్నారని, ముందు ఆ విషయం తెలుసుకో అని సవాల్ విసిరి, రియల్ ఎస్టేట్ వ్యవహారానికి పొలిటికల్ కలర్ పూశారు. లోకేశ్‌పై అనిల్ చేసిన ఆరోపణలపై నెల్లూరు టీడీపీ నేతలు భగ్గుమన్నారు. మంత్రిగా ఉన్నప్పుడు అవినీతి ఆరోపణలపై సాక్ష్యాధారులు సమర్పిస్తే ఏం చేశావని నిలదీశారు.అనిల్ వ్యాఖ్యలకు టీడీపీ కూడా అదే స్థాయిలో స్పందించింది.

## ఎండలతో పోటీ పడుతున్న కూరలు



విజయవాడ, మే 18, బెజవాడలో కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. టమాటా ధర ఏకంగా 70 రూపాయలకు చేరింది. రెండు నెలల క్రితం నగరంలో కేజీ టమాటా 10 రూపాయలు మాత్రమే. ఇప్పుడా ధర వంద రూపాయలకు చేరుకునేలా ఉంది. ఏ కూర వండినా అందులో టమాటా ఉండాల్సిందే. అలాంటి టమాటా ఇప్పుడు కొనాలంటేనే కరువైపోయింది. తుఫాన్‌తో పంట నష్టపోవటమే రేట్లు పెరగటానికి కారణం అంటున్నారు వ్యాపారులు.మరోవైపు, కర్నూలు, చిత్తూరు, మదనపల్లి మార్కెట్లోనూ టమాటా ధర భారీగా పెరిగిపోయింది. ఒకవైపు ఎండలు, మరోవైపు అకాల వర్షాలతో దిగుబడి పడిపోయింది. దిగుబడి తగ్గటం, ఉన్న పంట పాడైపోవటంతో రేట్లు ఒక్కసారిగా పెరిగిపోయాయి. అటు వ్యాపారుల, ఇటు సామాన్యులు పెరిగిన ధరలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిజానికి? ఒక్క టమాటా మాత్రమే కాదు వంకాయ, బెండకాయ తప్ప క్యాప్సికమ్, చిక్కుడు లాంటి కూరగాయలు 80 రూపాయల దగ్గర ఉన్నాయి. చికెన్ రేట్లు కూడా భారీగా పెరిగిపోతున్నాయి. ధరల భారంతో సామాన్యులు బతకటం కష్టంగా మారింది.

## సింహపురిలో బంగారం, రాగి నిక్షేపాల అన్వేషణ

నెల్లూరు, మే 18,నెల్లూరు జిల్లాలోని ఉదయగిరి కొండల్లో బంగారం, రాగి నిక్షేపాల అన్వేషణ కోసం కేంద్రం మరో ముందడుగు వేసింది. నెల్లూరు జిల్లా ఉదయగిరి మండలంలోని మాసాయిపేట కొండపై బంగారు, రాగి, వైట్ క్వార్ట్ ఖనిజ నిక్షేపాల ఆనవాళ్లు కనిపించడంతో.. కేంద్రం ఆధ్వర్యంలో అన్వేషణ ప్రారంభమైంది. ఈ మేరకు కొండపై నిక్షేపాలగుర్తింపు కోసం ముమ్మరంగా డ్రిల్లింగ్ పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటికే కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మ్యాపింగ్ నిర్వహించి కొండలో ఎంత మేర ఖనిజ నిక్షేపాలు ఉన్నాయో తెలుసుకునేందుకు కొంత కాలంగా డ్రిల్లింగ్ పనులు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా.. కొండపై ఐదు ప్రాంతాల్లో 500 నుంచి 1000 అడుగుల మేర డ్రిల్లింగ్ నిర్వహించి.. 46 నమూనాలు సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించింది.ఉదయగిరి మండలం ఉదయగిరి, మాసాయిపేట పరిసర ప్రాంతాలలో సుమారు రెండు వేల హెక్టార్లకు పైగా భూముల్లో బంగారు, రాగి, వైట్‌క్వార్ట్జ్ నిక్షేపాలున్నట్లు గుర్తించింది. హైదరాబాద్ నుంచి అధికారుల బృందంతో జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా వాహనంతో డ్రిల్లింగ్ చేసే ప్రాంతానికి చేరుకొని తాజాగా పరిశీలించారు. 150 మీటర్ల మేర డ్రిల్లింగ్ వేసిన ప్రాంతంలో భూగర్భంలోకి సీసీ కెమెరాలు పంపి నిశితంగా వివరాలు సేకరిస్తున్నారు. దీంతోపాటు నమూనాలు సేకరించి ల్యాబ్‌కు తరలిసిస్తున్నారు. కాగా.. ఖనిజ నిక్షేపాలతోనైనా ఉదయగిరి మెట్ట ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ఈ ప్రాంత వాసులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.సుమారు రెండు వేల హెక్టార్లకు పైగా భూముల్లో బంగారు, రాగి, వైట్‌క్వార్ట్జ నిక్షేపాలున్నట్లు గుర్తించింది. సోమవారం హైదరాబాద్ నుంచి అధికారుల బృందంతో జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా వాహనంతో డ్రిల్లింగ్ చేసే ప్రాంతానికి చేరుకొని పరిశీలించారు. 150 మీటర్ల మేర డ్రిల్లింగ్ వేసిన ప్రాంతంలో భూగర్భంలోకి సీసీ కెమెరాలు పంపి సేకరిస్తున్నారు. ఖనిజ నిక్షేపాలతోనైనా ఉదయగిరి మెట్ట ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ఈ ప్రాంత వాసులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## పీసీసీ చీఫ్ గా నల్లారి...

తిరుపతి, మే 18, ఆంధ్రప్రదేశ్ లో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసే దిశగా పార్టీ అధినేత్రి సోనియా గాంధీ అడుగులు వేస్తున్నారా? అందుకే ఏపీ మాజీ సీఎం, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చివరి ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డిని ఢిల్లీకి పిలిపించారా? అన్న ప్రశ్నలకు పరిశీలకులు ఔననే సమాధానం ఇస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పునర్వైభవం సంగతి అటుంచి కనీసం ఉనికినైనా కాపాడుకోవలసిన అవసరం ఉందని భావిస్తున్న కాంగ్రెస్ అధిష్టానం నల్లారి కిరణ్ కుమార్ రెడ్డిని అందుకు అనువైన వ్యక్తిగా గుర్తించారని పరిశీలకులు అంటున్నారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో కాంగ్రెస్ పార్టీ అత్యంత బలమైన పార్టీ అనడంలో సందేహం లేదు. అయితే రాష్ట్ర విభజన అనంతరం ఆ పార్టీకి రాష్ట్రంలో నాయకులే లేకుండా పోయారు. అలాగే రాష్ట్రంలో కాంగ్రెస్ ఉనికి కూడా నామమాత్రంగా మిగిలిపోయింది. విభజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆ పార్టీకి అసెంబ్లీలో ప్రాతినిథ్యమే లేకుండా పోయింది.అయితే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చివరి ముఖ్యమంత్రిగా పని చేసిన నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి అప్పటి ఏపీ ప్రజల సెంటిమెంట్ కు అనుగుణంగా 2014 ఎన్నికలలో సమైక్యాంధ్ర నినాదంతో ఎన్నికల బరిలో దిగారు. అయితే ఎన్నికలలో ఒక్క స్థానంలో కూడా విజయం సాధించలేకపోయారు అది వేరే సంగతి. ఆ తరువాత నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి రాజకీయంగా దాదాపు కనుమరుగైపోయారనే చెప్పాలి. కానీ ఇప్పుడు హస్తిన నుంచి పిలుపు రావడంతో ఆయన మళ్లీ రాజకీయాలలో లైమ్ లైట్ లోకి వచ్చే



అవకాశాలున్నాయని పరిశీలకులు అంటున్నారు.విభజన అనంతరం కాంగ్రెస్ ను వీడి సమైక్యాంధ్ర కోసం సొంత పార్టీ పెట్టుకున్నా, ఇప్పటి వరకూ ఆయన మరో పార్టీలో చేరడం కానీ, కాంగ్రెస్ హై కమాండ్ పై విమర్శలు గుప్పించడం కానీ చేయని కారణంగానే సోనియాగాంధీ ఆయనకు మరో అవకాశం ఇవ్వాలని భావించినట్లు ప్రచారం అవుతోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసే బాధ్యతను నల్లారికి అప్పగించే యోచనలో హై కమాండ్ ఉన్నట్లు చెబుతున్నారు.

## నిరాశగా మామిడి పంటలు



విజయవాడ, మే 18, లాలకు రాజు.. మామిడి. మధుర మామిడి రసాలను రుచి చూడకుండా ఎవరూ ఉండరు. అలాంటి మామిడికి రెండు తెలుగు రాష్ట్రాల్లో పేర్గాంచింది మాత్రం నూజివీడు. ఇక్కడ లభ్యమయ్యే బంగినపల్లి, చిన్నరసాలు, మామిడి రసాలంటే ఇష్టపడని వారు ఉండరు. అంతగా నూజివీడు మామిడికి ప్రసిద్ధి. కలెక్టర్ (తోతాపురం) రకం కూడా సాగవుతోంది. ఈ ప్రాంతం నుంచి రాష్ట్రంలోని నున్న మామిడి మార్కెట్‌తో పాటు హైదరాబాద్ మార్కెట్‌కు ఎగుమతి చేస్తున్నారు. ఇతర రాష్ట్రాల్లోని చెన్నై, ముంబై, ఢిల్లీ, బరోడా, ఇండోర్, నాగపూర్, అహ్మదాబాద్ వంటి ప్రాంతాలకు సైతం ఎగుమతి అవుతోంది. అలాగే మలేసియా, సింగపూర్‌లకే కాకుండా పశ్చిమ ఆసియా దేశాలకు సైతం మామిడి ఎగుమతవుతున్నాయి. పురాతన కాలం నుంచి ఈ ప్రాంతంలో మామిడిని రైతులు సాగుచేస్తున్నారు. మామిడి సహజంగా బెట్ట పంట కావడంతో ఒక ఏడాది కాపు ఎక్కువ వస్తే, తరువాత ఏడాది తక్కువ వస్తుంది. నూజివీడు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో కలిపి దాదాపు 40 వేల ఎకరాల్లో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. అలాగే చింతలపూడి నియోజకవర్గంలోని చింతలపూడి, టి.నరసాపురం, కామవరపుకోట, లింగపాలెం, ద్వారకాతిరుమల, జంగారెడ్డిగూడెం మండలాల్లో కలిపి దాదాపు 12 వేల ఎకరాల్లో మామిడి సాగవుతోంది. ఇప్పటివరకు కృష్ణా జిల్లాలో ఉన్న నూజివీడు ప్రాంతం ఏలూరు జిల్లాలోకి రావడంతో మామిడి సాగు విస్తీర్ణం జిల్లాలో పెరిగినట్లయింది. మామిడి పూర్తిగా వాతావరణాధారిత పంట కావడంతో మామిడి రైతులకు తీపి చేదులు సర్వసాధారణంగా మారింది. మామిడి అభివృద్ధి కోసం రైతులకు సకాలంలో సలహాలు సూచనలు అందించేందుకు నూజివీడులో మామిడి పరిశోధన స్థానం సైతం ఉంది. తాడేపల్లిగూడెంలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ ఆధ్వర్యంలో ఈ పరిశోధన స్థానం పనిచేస్తుంది. ఇందులో ము గ్గురు శాస్త్రవేత్తలు రైతులకు సలహాలు, సూచనలు అందిస్తున్నారు. అలాగే నూజివీడులోనే మ్యాంగో హబ్ సైతం ఉంది. దీనిలో మామిడికాయలను ప్రాసెసింగ్ చేసి ఎగుమతి చేస్తారు. రైతులకు సరైన సలహాలు, సూచనలను సకాలంలో అందించడంతో పాటు గిట్టుబాటు ధర లభించేలా చర్యలు చేపడితే మామిడి విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉంది.

## కాన్పులో నిర్లక్ష్యం?శిశువు పరిస్థితి అందోళనకరం

భద్రాద్రి కొత్తగూడెం కొత్తగూడెం రామవరం మాతా శిశువైద్య కేంద్రంలో దారుణం జరిగింది. డాక్టర్లు కాన్పు చేస్తూ శిశువు చెయ్యి విరిచినట్లు బంధువులు ఆరోపిస్తున్నారు. శిశువు పరిస్థితి ఆందోళనకరంగా మారింది. కాన్పు కోసం వచ్చిన భువన అనే మహిళకు వైద్యులు నిర్లక్ష్యంగా శస్త్ర చికిత్స చేసారని ఆరోపణ. ఆపరేషన్ సమయంలో బిడ్డను బయటకు తీసే క్రమంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో శిశువు చేయి విరిగింది. ఘటన సోమవారం రాత్రి జరిగినప్పటికీ వైద్యులు బయటకు తెలియకుండా జాగ్రత్తపడ్డారని బంధువుల పిర్యాదు. విరిగిన బిడ్డ చేతికి కట్టు కట్టి తప్పును కప్పిపుచ్చుకునేందుకు సిబ్బంది ప్రయత్నం చేసారు. వైద్యులపై శిశువు బంధువులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సరళను సరైన వివరణ కోరగా జరిగిన విషయం తనకు కొద్ది సేపటి క్రితమే తెలిసిందని అన్నారు.

## పోలీసుల అదుపులో నలుగురు గొలుసు దొంగలు

నందిగామ గత వారం రోజులు క్రితం కంచికచర్ల శివారు ప్రాంతంలో స్కూటీ పై వెళ్తున్న మహిళ మెడలో గొలుసును స్పోర్ట్స్ బైక్ పై వచ్చి లాక్కెళ్ళిన ఇద్దరు దొంగలు సుభాని, నవీన్ కుమార్ ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుండి 24 గ్రాముల బంగారు గొలుసు, స్పోర్ట్స్ బైక్ సీజ్ చేసారు. అలాగే కంచికచర్ల మండలం పెండ్యాలలో ఒక టీచర్ ను ఆటోలో ఎక్కించుకుని బెదిరించి చైన్ లాక్కొని వెళ్లిన బాలాజీ, ప్రవీణ్ కుమార్ అనే ఇద్దరు దొంగలను అదుపులోకి తీసుకుని వారి వద్ద నలభై ఎనిమిది గ్రాముల బంగారం స్వాధీనం చేసుకుని ఆటో సీజ్ చేసారు. వీరిపై రౌడీషీట్లు ఓపెన్ చేస్తామని నిరంతరం వీరిపై నిఘా పెడతామని కంచికచర్ల ప్రాంతంలో భద్రత పెంచుతామని డిసిపి జాషువ తెలిపారు

## వైభవంగా అప్పన్నకు ఆర్జిత సేవలు

సింహాచలం సింహాచల పుణ్య క్షేత్రములో దేవస్థాన వేదపండితుల వేదమంత్రాల, నాదస్వర మంగళ వాయిద్యాలతో శాస్త్రోక్తంగా పలు ఆర్జిత సేవలు వైభవంగా నిర్వహించారు. అర్చకులు వేకువ జామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రాతఃకాల పూజలు సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. శ్రీ దేవి, భూదేవి సమేత శ్రీ గోవింద రాజు స్వామి వారిని సర్వాంగ సుందరంగా అలంకరించి, వేదికపై అధిష్టింప జేసి వేద మంత్రాలు నాధ స్వర మంగళ వాయిద్యాల నడుమ శ్రీ స్వామి వారి సహస్ర నామార్చన, వైభవంగా నిర్వహించారు ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా భక్తులు శ్రీ స్వామి వారి ఆర్జిత సేవలలో పాల్గొని తరించారు.

## ఎమ్మెల్యే కాటసాని కుమారుడి వివాహా వేడుకకు హాజరైన సీఎం

నంద్యాల హైదరాబాద్ లో బుధవారం నాడు హైటెక్ సిటీ యందు హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్లో బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కుమారుడు శివ ఓబుల్ రెడ్డి, వధువు మేధాశ్రీ రెడ్డిలను ఆశీర్వదించిన ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి. నంద్యాల మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి తెలుగుదేశం పార్టీ . వైయస్ఆర్ కాంగ్రెసు పార్టీ కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# వేగంగా నిర్వాసితుల ఇళ్ల నిర్మాణం

ఏలూరు, మే 18,పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో భూమిని సేకరించి అనేక గ్రామాల్లో పునరావాస కాలనీలు నిర్మిస్తున్నారు. ఈ క్రమంలో పోలవరం నియోజకవర్గంలోని వేలేరుపాడు, కుక్కునూరు మండలాల నిర్వాసితులతో పాటు పోలవరంలోని పోలవరం, తూర్పుగోదావరి జిల్లాలోని కొన్ని గ్రామాలకు చెందిన గిరిజనేతరులకు జంగారెడ్డిగూడెం సమీపంలోని తాడువాయిలో అతి పెద్ద పునరావాస కాలనీ నిర్మిస్తున్నారు. ప్రభుత్వం మొక్కుబడిగా నిర్మించి చేతులు దులుపుకోకుండా సకల సౌకర్యాలతో వందల కోట్ల వ్యయంతో కాలనీ నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగిస్తోంది. ఇప్పటికే 7500 జనాభాతో ఉన్న తాడువాయి గ్రామం ఆర్అండ్ఆర్ కాలనీ పూర్తిస్థాయిలో సిద్ధమైతే ఒకేసారి 32 వేల పైచిలుకు జనాభాతో మున్సిపాలిటీగా మారనుంది. తాడువాయిలో 6048 ఇళ్ల నిర్మాణం కోసం 1047 ఎకరాల భూమి సేకరించారు. ఇళ్లు, మౌలిక సదుపాయాల కోసం 530 ఎకరాలు కేటాయించారు. రూ.435.05 కోట్ల వ్యయంతో 3905 ఇళ్ల నిర్మాణం ప్రారంభించారు. ఇవిగాక 938 మంది నిర్వాసితులు ప్లాట్లు తీసుకుని వారే స్వయంగా నిర్మించుకుంటున్నారు. మరో 1205 ప్లాట్లను సిద్ధం చేసి ఉంచారు. 3905 ఇళ్ల నిర్మాణాలకు గాను 1024 ఇళ్లు పూర్తయ్యాయి. ఇప్పటికే కొన్ని కుటుంబాలు ఇక్కడికి వచ్చి నివాసం ఉంటున్నాయి. ప్రభుత్వం ఆర్అండ్ఆర్ కాలనీ నిర్మాణానికి అధిక ప్రాధాన్యతనిచ్చిన క్రమంలో ప్రతి వారం సమీక్షలు నిర్వహించడంతో పాటు జిల్లా కలెక్టర్ మొదలుకొని స్థానిక అధికారుల వరకు పనులు పర్యవేక్షిస్తున్నారు. గత నెలలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కేంద్ర జలవనరుల శాఖ మంత్రి గజేంద్ర షెకావత్ తాడువాయి కాలనీల్లో పర్యటించి నిర్మాణ పురోగతి, అక్కడి స్థితిగతులపై లబ్ధిదారులతో మాట్లాడారు. దీంతో పనుల్లో వేగం పెరిగింది.

తాడువాయి మేజర్ పంచాయతీ కాగా, దీనికి శివారు గ్రామాలుగా మంగిశెట్టిగూడెం, చల్లవారి గూడెం, గొల్లగూడెం, జొన్నవారిగూడెం ఉన్నాయి. తాడువాయిలో మిగిలిన 517 ఎకరాలను యువతకు ఉద్యోగ కల్పన, మార్కెటింగ్, అవసరమైన కర్మాగారాల ఏర్పాటుకు, సామాజిక అవసరాలకు వినియోగించనున్నారు.

ఇళ్ల నిర్మాణంతో పాటు గుడి, మసీదు, చర్చి, అంగన్‌వాడీ కేంద్రం, కమ్యూనిటీ హాలు, పంచాయతీ కార్యాలయం, షాపింగ్ కాంప్లెక్స్, పాఠశాలలు, బ్యాంక్, రైతుబజార్, ఏఎన్ఎం సబ్‌సెంటర్, పశు ప్రాథమిక వైద్యశాల, గోడౌన్లు, మినీ కోల్డ్ స్టోరేజీ, వాటర్ ట్యాంక్, బస్ షెల్టర్, ఇండోర్ స్టేడియం, డంపింగ్ యార్డు, పోస్టాఫీసు, పీహెచ్‌సీ, శ్మశానవాటికలు, వ్యక్తిగత మరుగుదొడ్లు, రెండు పార్కులు నిర్మిస్తున్నారు.

ఇవిగాక ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో లబ్ధిదారులు కొందరు స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్, అనువుగా ఉండే కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేయాలని కోరిన నేపథ్యంలో దానిపై కార్యాచరణ ప్రారంభమైంది.

తాడువాయి ప్రస్తుత జనాభా 7500 కాగా, నిర్వాసితులంతా వారి గృహాల్లోకి చేరుకుంటే అదనంగా 24,500 మంది పెరగనున్నారు. దీంతో మొత్తం జనాభా 32 వేలకు చేరుకోనున్నట్టు అంచనా.

దీంతో మండలంలోనే అతి పెద్ద పంచాయతీగా తాడువాయి రూపుదిద్దుకోనుంది. భవిష్యత్తులో ప్రభుత్వ నిబంధనల మేరకు మున్సిపాలిటీగా రూపాంతరం చెందనుంది.

# అసభ్య పదజాలంతో విమర్శించే మీ నాయకుడి కి నేర్పండి సభ్యత సంస్కారం

మంథని అసభ్య పదజాలంతో విమర్శించే మీ నాయకుడి కి నేర్పండి సభ్యత సంస్కారం అని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆర్ల నాగరాజు, మంథని సత్యం, జంజర్ల శేఖర్, తోకల మల్లేష్, ఎరుకల ప్రవీణ్, మంథని రాకేష్ లు అన్నారు. బుధవారం మంథని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సభ్యత సంస్కారం ఉన్న నాయకుడి దగ్గర పని చేస్తున్నాము కనుక విలువలతో కూడిన రాజకీయలు చేస్తున్నామని, కుటుంబపరమైన శుభకార్యాలను కూడా రాజకీయాలకు వాడుకోవడం సిగ్గుచేటన్నారు. న్యాయవాద దంపతుల చావు పై చర్చ జరగాలని,పేదింటి బిడ్డ మంథని మధుకర్ చావు పై, ఇసుక మాఫియా వల్ల లారీల కింద చనిపోయిన చావుల పై చర్చ జరగాలన్నారు. అభివృద్ధి ద్వారా ప్రజలకు దగ్గర కావాలి కానీ విమర్శలు చేసి ప్రజలకు చేరువ కావాలనుకోవడం మీ అవివేకానికి నిదర్శనమన్నారు. 30 సంవత్సరాలలో సాధ్యంకాని అభివృద్ధి మంథని నియోజకవర్గంలో పుట్ట మధు 4 సంవత్సరాలలో అభివృద్ధి చేస్తే మరలా తిరిగి ఎందుకు ఓడిపోయాడో మంథని తెరాస నాయకులు ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. మంథని నియోజకవర్గం మేధావుల నిలయం మీరు ఎన్ని అసత్య ఆరోపణలు చేసిన ప్రజలు మీ నాయకుడిని నమ్మే పరిస్థితిలో లేరన్నారు. మంథని ఎమ్మెల్యే శ్రుద్దిళ్ళ శ్రీధర్ బాబు పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదన్నారు.మంథని నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషిచేసిన ఘనత దుద్దిళ్ళ కుటుంబానిదన్నారు. అవకాశం కోసం వచ్చిన వ్యక్తి కాదు ఆశయం కోసం వచ్చిన వ్యక్తి మా నాయకుడు శ్రీధర్ బాబు అన్నారు. శ్రీధర్ బాబు మంత్రిగా ఉన్న సమయంలో నియోజకవర్గంలో జె.ఎన్.టి.యు, అగ్రికల్చర్, డిగ్రీ, పాలిటెక్నిక్, ఐటిఐ, కళాశాలను అన్ని మండలాలలో జూనియర్ కళాశాలలను ఏర్పాటు చేసి విద్యకు పెద్దపీట వేశారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనే ఎ నియోజకవర్గంలో కూడా మంజూరు కానీ 63 వేల ఇందిరమ్మ ఇళ్లను మంథని నియోజక వర్గానికి మంజూరు చేసిన ఘనత శ్రీధర్ బాబుదన్నారు. తెరాసా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ హయాంలో మంథని నియోజకవర్గంలో ఎంతమంది దళితులకు మూడు ఎకరాల భూమి కానీ డబుల్ బెడ్ రూములు కానీ నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పన కల్పించారో చెప్పాలన్నారు. మంథని ఎమ్మెల్యే శ్రీధర్ బాబు పై పుట్టమధు చేసిన అనుచిత వ్యాఖ్యలపై మంథని మండల పార్టీ అధ్యక్షుని హోదాలో సెగ్గం రాజేష్ పాత్రికేయుల సమావేశంలో ఖండిస్తే మంథని తెరాస నాయకులు నాయకుడి మెప్పు కోసం సెగ్గం రాజేష్ గారి పై వ్యక్తిగత జీవితానికి సంబంధించిన విషయాల వీడియోలు సోషల్ మీడియాలో డిలీట్ చేయకపోతే పోలీస్ స్టేషన్లో చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేస్తామన్నారు. అధిష్టానం మెప్పు కోసం పుట్ట మధు, పుట్ట మధు మెప్పు కోసం మంథని తెరాస నాయకులు మరొక్కసారి మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ని గాని మా కాంగ్రెస్ నాయకులను గాని విమర్శిస్తే తస్మాత్ జాగ్రత్త అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అక్కపాక సదయ్య, ఆర్ల నారాయణ, జనగామ సదువలి, పొనగంటి రమేష్, కొప్పుల రాఘవ, బడికల మనోజ్, ఇందారపు అనిల్ తదితరులు పాల్గొన్నారు

# సిద్దేశ్వరం, జానాలగూడెం, బాలపాలతిప్ప ముంపు గ్రామాల నిరుపేదలను

### ఆదుకోండని నంద్యాల జిల్లా ఎస్. పి కి బైరెడ్డి వినతి



నంద్యాల నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలం సిద్దేశ్వరం, జానాలగూడెం, బాలపాలతిప్ప గ్రామాల్లో రైతులను, చెంచు గిరిజనులను, నిరుపేదలను కొందరు అధికార దాహంతో తీవ్ర ఇబ్బంది పెడుతున్నారని వారినుండి నిరుపేదలకు రక్షణ కల్పించాలని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి కోరారు. బుధవారం నంద్యాల జిల్లా ఎస్. పి. రఘువీరారెడ్డికి బైరెడ్డి రాజశేఖరరెడ్డి బాధితులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బైరెడ్డి మాట్లాడుతూ ప్రపంచానికి వెలుగు అందించేందుకు శ్రీశైలం ప్రాజెక్టు క్రింద సర్వం త్యాగం చేసిన వందలాది కుటుంబాలు నేటికీ నల్లమల అడవిలో ఎత్తు పల్లాల్లో పూరి గుడిచెల్లో చిమ్మ చీకటి అనుభవిస్తున్నారని ఆవేదన చెందారు. శ్రీశైలం రిజర్వాయర్ ముంపుకు గురై 1980 సంవత్సరంలోనే కట్టుబట్టలతో ఊళ్లు వదలి ఆ గ్రామాల సమీపంలోని ఎత్త యినా అడవిలోనే అన్ని కష్టాలు అనుభవిస్తూ 42 ఏళ్ళు గా చీకటి లోనే తల దాసుకుంటున్నారని, ఏ చిన్న ఆపద కుటుంబంలో వచ్చిన రోడ్డు లేని అడవి లో కిలోమీటర్లు కాలినడక వెళ్లాల్సి వస్తుంద ని బైరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆనాటి నుండి నేటి వరకు శ్రీశైలం రిజర్వాయర్ లో నీరు ఉన్నప్పుడు చేపల వేట, రిజర్వాయర్ లో నీరు తగ్గినప్పుడు ఆ పొలాల్లోనే ఆరుతడి పంటలు జొన్న, కంది, పెసలు, మినుములు, ప్రొద్దుతిరుగుడు, నువ్వులు తదితర పంటలు సాగు చేసుకొని జీవనం సాగిస్తున్నారని వివరించారు. 1980 వ సంవత్సరం నుండి 2016 వరకు ఎలాంటి సమస్య లేని ఈ గ్రామాల నిరుపేదలకు కొందరు అధికారం అడ్డం పెట్టుకొని గ్రామాలు వదిలి వెళ్లి ఇతర ప్రాంతాలలో స్థిరపడ్డ వారి పొలాలు సాగు చేయవద్దని 2017 నుంచి అనేక కష్టాలు పెడుతున్నారని, అక్రమ కేసులు పెడుతున్నారని, దాడులు చేస్తున్నారని జిల్లా ఎస్. పి దృష్టికి బైరెడ్డి తెచ్చారు. రిజర్వాయర్ లో నీరు లేక చేపలు పట్టుకోలేక, భూమి సాగు చేసులేక పేదలు ఆకలితో అలమటిస్తూ అడవి పలసాయంతో కడుపు నింపుకొని కాలం వెళ్ళాదిస్తూన్నారని వివరించారు. ప్రభుత్వం కొన్ని స్వచ్ఛంద సంస్థల ద్వారా సిద్దేశ్వరం, జానాలగూడెం, బాలపాలతిప్ప గ్రామాల్లో కొందరికి పక్కా గృహాలు కూడా నిర్మించినదని, రేషన్ కార్డులు, ఆధార్ కార్డు లు, ఓటర్ కార్డు లు కూడా ఇచ్చిందని ఆయన వివరించారు. అధికార పార్టీ వారి ఆగాడాలకు అడ్డుకట్టవేసి భూమిని, గ్రామాలను నమ్ముకున్న నిరుపేదలకు జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్. పి లు రక్షణ కల్పించి భూమి సాగుకు అవకాశం కల్పించాలని బైరెడ్డి కోరారు. పూర్తి వివరాలు సేకరించి భాధితులకు న్యాయం చేస్తామని జిల్లా ఎస్. పి రఘు వీరారెడ్డి భాధితులకు హామీ ఇచ్చారు. అనంతరం భాధితులు జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమం లో జానాలగూడెం గట్టుమీద వెంకటేశ్వర్లు, పి. బయ్యాన్న పెరుమాళ్ళ తిక్కస్వామి, మిరపం చెంచు బాలమ్మ, ఊరతనూరు తిక్కస్వామి, లక్ష్మయ్య, బలపాలతిప్ప వాసు లు జి. నారాయణ, మౌలాలి, సంఘం తిక్కస్వామి, దుర్గం పెద్ద పుల్లయ్య, పి. నారాయణ, పి. బయ్యాన్న, శ్రీనువాసలు, ఈశ్వరయ్య, నరసింహ, వెంకటేష్ తదితర భాధితులు జిల్లా ఎస్. పి. జిల్లా కలెక్టర్ లను కలిసి వినతి పత్రాలు అందజేశారు.

## జూన్ 6న చలో విజయవాడ మహా ధర్నాను విజయవంతం చేయాలి

### వి.హెచ్. పి .ఎస్ జిల్లా కన్వీనర్ మందా పెంచలయ్య

నెల్లూరు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ సూచనలు సలహాలు మేరకు మహా ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సంకల్పించామని వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్ పేర్కొన్నారు .వికలాంగుల సమస్యల పరిష్కారానికి జూన్ 6న చలో విజయవాడ మహా ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని జిల్లా లోని వికలాంగుల నాయకులు సభ్యులు ఎమ్మార్పీఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముఖ్యంగా వికలాంగులకు 6వేల పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేయడంతో పాటు రాజ్యాంగ పరిరక్షణ ప్రకారం వికలాంగుల హక్కుల సాధనకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సహకారం అందించాలని డిమాండ్ చేయడంలో భాగంగా ఈ మహా ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు వికలాంగుల సంఘం జాతీయ అధ్యక్షులు వెంకట రమణయ్య, జిల్లా అధ్యక్షులు రమేష్ నాయుడు, మహిళా అధ్యక్షురాలు గున్నం సుజాత, వికలాంగుల హక్కుల పోరాట సమితి కన్వీనర్ మంద పెంచలయ్య మాదిగ, సభ్యులు బాబు యాదవ్, మందా సుకుమార్, అంకబాబు, చిట్టి తదితరులు పాల్గొన్నారు.

## జగన్ రెడ్డి రాజ్యంలో బాదుడే బాదుడు..

### కుమ్ముడే కుమ్ముడు

నెల్లూరు ముత్తుకూరు మండలం పొట్టెంపాడులో నిర్వహించిన బాదుడే బాదుడు నిరసన కార్యక్రమంలో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ మంత్రివర్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పాల్గొన్నారు. సోమిరెడ్డి మాట్లాడుతూ మూడేళ్లుగా ఓ వైపు రైతులపై, మరో వైపు ప్రజలపై వైసీపీ ప్రభుత్వం రోజుకు ఒక రూపంలో దాడులు చేస్తోంది. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇరిగేషన్ వ్యవస్థను సమూలంగా ఆధునీకరించినప్పటికీ రైతుల వద్ద నీటి తీరువా వసూలు చేయలేదు. ఇప్పుడు జగనన్న వచ్చి కాలువల్లో తట్ట మట్టి తీయకపోగా ఏడేళ్లకు సంబంధించి వడ్డీతో సహా నీటి తీరువా కట్టి కట్టాల్సిందేనని రైతులపై వత్తిడి తేవడం దుర్మార్గం. యూనిట్ రూ.6.85గా ఆక్వా విద్యుత్ చార్జీలను టీడీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు నాయుడు రూ.2కి తగ్గించారు. ఆ రూ.2ని రూ.1.50కి తగ్గించామని చెబుతున్న జగన్ రెడ్డి జోన్లు, నాన్ జోన్ల పేరుతో ఆక్వా రైతులను బాదేస్తున్నారని అన్నారు. జోన్ లో ఉంటేనే రూ.1.50 అంట ఐదెకరాలు దాటితే రూ.3.85 అంట..నాన్ ఆక్వాజోన్ లో రూ.4 అంట. ఒక రోజు కరెంట్ చార్జీలు పెంపు, మరో రోజు విద్యుత్ చార్జీలు, ఓ వైపు ఇంటి పన్నులు, ఇంకో వైపు చెత్త పన్ను...ఇలా రోజుకో పన్ను అంటూ ప్రజల నడ్డి విరగ్గొట్టేస్తున్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో వ్యవసాయానికి 9 గంటల పాటు ఇచ్చిన విద్యుత్ ను 7 గంటలకు కుదించడమే గాక ఇప్పుడు అదనంగా మీటర్లు బిగిస్తారంట. మీటర్లు పెడితే 30 శాతం విద్యుత్ మిగులుతుందని మంత్రులు ప్రకటిస్తున్నారు...అప్పుడు ఆ 30 శాతం విద్యుత్ ను రైతులు దొంగతనం చేస్తున్నారని చెబుతున్నారా. ఈ రోజు మీటర్లు పెడతామంటారు...రేపు ఆక్వా రైతులను మోసం చేసినట్టే మోసం చేసి యూనిట్ పావలానో, అర్ధరూపాయో వసూలు చేసే కుట్రలో జగన్ రెడ్డి ప్రభుత్వం ఉంది. అందుకే వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు మీటర్లు పెడితే ఎట్టి పరిస్థితుల్లో ఒప్పుకోం..ఈ విషయంలో తాడోపేడో తేల్చుకుంటామని అన్నారు. మా ప్రభుత్వంలో పుట్టికి 850 కిలోల వంతున కొనుగోలు చేసి రైతులకు వారం రోజుల్లో నగదు చెల్లించామని అన్నారు.

మీ ప్రభుత్వంలో 200 నుంచి 300 కిలోలు అదనంగా తీసుకుంటూ రైతుల పుట్టి ముంచడంతో పాటు నగదు కూడా ఆరేడు నెలలకూ చెల్లించని పరిస్థితి. ఏదో ఉద్ధరిస్తాడని ప్రజలు 151 సీట్లు ఇస్తే ప్రభుత్వాన్ని కార్పొరేట్ కంపెనీగా మార్చి వ్యాపారం చేసుకుంటున్నారు. నిన్న పత్రికల్లో భారీ ప్రకటనలు ఇచ్చారు. మూడేళ్లలో రైతుల కోసం 1.10 లక్షల కోట్లు ఖర్చు పెట్టారంట..43 వేల కోట్లకు పైగా మొత్తాన్ని ధాన్యాన్ని కొనుగోలు చేయడానికే ఖర్చుపెట్టారంట..ఇది మరీ విడ్డూరంగా ఉంది. రైతుల వద్ద ధాన్యం కొని ఏట్లో పోశారా...కాదు మిల్లింగ్ చేసి ఎఫ్.సి.ఐకి అమ్మారు..ఆ డబ్బులకు రైతులకు ఇచ్చారు..ఇక్కడ నువ్వు రైతులకు ఖర్చుపెట్టిందేంటో. చివరకు అగ్రికల్చర్ మార్కెటింగ్ సెస్ భారాన్ని రైతులపై మోపి ఆ ఆదాయం చూపి అప్పులు తెచ్చుకునే పరిస్థితికి వచ్చారు. జగన్ రెడ్డి రాజ్యంలో వ్యవస్థలు సర్వనాశనం అయిపోయాయి...ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు డమ్మీలుగా మారిపోవడం చూస్తే చాలా బాధేస్తోందని అన్నారు.

## యాంటీ షిప్ క్షిపణీని పరీక్షించిన నేవీ

విశాఖపట్నం డీఆర్డీవో సహకారంతో ఇండియన్ నేవీ విజయవంతంగా యాంటీ షిప్ మిస్సైల్ను పరీక్షించింది. స్వదేశీయంగా అభివృద్ధి చేసిన నావల్ యాంటీ షిప్ మిస్సైల్ను సీకింగ్ 42బీ హెలికాప్టర్ నుంచి పరీక్షించారు. ఒడిశాలోని బాలసోర్ తీరంలో ఈ పరీక్ష జరిగినట్లు అధికారులు తెలిపారు. దానికి సంబంధించిన వీడియో ఇదే. నావెల్ యాంటీ షిప్ మిస్సైల్ను పరీక్షించడం ఇదే తొలిసారి.స్వదేశీంగా అభివృద్ధి చేసిన యాంటీ షిప్ మిస్సైల్ ప్రయోగంతో మరోసారి ఇండియన్ నేవీ ఘనతను సాదించి చరిత్రకెక్కింది.సాంకేతిక పరిజ్ఞాన రంగంలో ఉన్నతస్థాయికి ఎదుగుతున్న ఇండియన్ నేవీ ... క్షిపణిని సాంకేతికత పరంగా వినియోగించడంలో నిర్దిష్ట లక్ష్యాన్ని అధిరోహించి కీర్తిప్రతిష్టతను సాధించింది.

## దిశా యాప్ రిజిస్ట్రేషన్ మెగా డ్రైవ్

విశాఖపట్నం సమాజంలోని ఆడవారిని గౌరవించాల్సిన అవసరం ప్రతి ఒక్కరి పై ఉందని విశాఖ జిల్లా కలెక్టర్ మల్లికా ర్జున తెలిపారు.దిశా యాప్ ద్వారా మహిళలకు ఒక ధైర్యం కల్పించిన ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అభినందనలు తెలిపారు. విశాఖ నగర పోలీస్ కమిషనర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో మహిళా భద్రత కోసం ఆంధ్ర ప్రదేశ్ పోలీస్ శాఖ రూపొందించిన దిశ యాప్ రిజిస్ట్రేషన్ మెగా డ్రైవ్ కార్యక్ర మం సిరిపురం వద్ద వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ ఏరినాలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విశాఖ జిల్లాలోని మహిళా ప్రజాప్రతి నిధులు మేయర్ హరి వెంకట కుమారి, జడ్పీ చైర్పర్సన్ సుభద్ర, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, వీఎంఆర్డీఏ చైర్మన్ విజయ నిర్మల, జిల్లా కలెక్టర్ మల్లికార్జున పాల్గొన్నారు.ఈ సందర్భం గా జిల్లా కలెక్టర్ మల్లికార్జున మాట్లా డుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అన్నిటిలో సగభాగం రిజర్వేషన్ కల్పించి గౌరవ స్థానంలో ఉంచిందని, ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కి ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇటీవల చిన్న పిల్లలపై జరుగుతున్న అకృత్యాలు క్షమించరా ని నేరమని, అటువంటి జరక్కుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. చట్టాలు కూడా చాలా బలంగా ఉన్నాయని తెలిపారు. ప్రస్తుత చట్టాల ద్వారా తక్కువ సమయంలో నే చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉందని గుర్తు చేశారు. నగర పోలీస్ కమిషనర్ శ్రీకాంత్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన దిశ యాప్ లో ఇప్పటివరకు 5 లక్షల 25 వేల మంది రిజిస్ట్రేషన్ చేసుకోవడం జరిగిందన్నారు. ఈ ఒక్కరోజే మెగా డ్రైవ్ ద్వారా మహిళల మొబైల్ ఫోన్లలో దిశ యాప్ ను పెద్ద ఎత్తున డౌన్లోడ్ చేయిస్తున్నట్లు తెలిపారు.

## ఆర్బికే మరియు హెల్త్ సెంటర్లను ప్రారంభించిన ఎమ్మెల్యే

### ఓటిఎస్ రిజిస్ట్రేషన్ పత్రాలను లబ్ధిదారులకు అందజేసిన ఎమ్మెల్యే

మద్దికేర మద్దికేర మండల పరిధిలోని గల బసినేపల్లి గ్రామంలో ఆర్బికే మరియు హెల్త్ సెంటర్లను బుధవారం రోజున పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవి ప్రారంభించారు. ముందుగా బసినేపల్లి దర్గాలో ప్రత్యేక పూజలను నిర్వహించి అనంతరం గ్రామంలో రూ 21.80 లక్షలతో పూర్తి అయిన రైతు భరోసా కేంద్రం ను మరియు రూ 17.50 లక్షలతో పూర్తి అయిన హక్కు పథకం లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేసారు.అదేవిధంగా హంప గ్రామస్థులకు ఇళ్ళ నిర్మాణ పత్రాలను పత్తికొండ శాసన సభ్యురాలు కంగాటి శ్రీదేవీ లబ్ధిదారులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో అధికారులు, స్థలదాత ఉండేకారి రామేశ్వరయ్య,సర్పంచ్ గుండ్లకొండ శ్రీదేవి,పత్తికొండ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ బసినేపల్లి భద్రయ్య,మాజీ సర్పంచ్ ప్రతాప్,చౌడప్ప,నాగేష,రామాంజనేయులు, పి.రామాంజనేయులు,నాగభూణం,శివప్ప, సుందరయ్య,జెడ్పీటీసీ సభ్యులు మురళిధర్ రెడ్డి,మాజీ ఎంపిపి మార్కెట్ యార్డ్ చైర్మన్ మల్లికార్జున యాదవ్,సచివాలయ ఉద్యోగులు, గ్రామ వాలంటీర్లు మరియు వైఎస్సార్ పార్టీ మండల నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.ఎటువంటి సమస్యలు తలెత్తకుండా మద్దికేర పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

# గడప గడప కూ మన ప్రభుత్వం



డాక్టర్ సి. ప్రభాకర రెడ్డి , ఎం.ఎస్
ఎంసిహెచ్ (సి టి వి ఎస్)
గుండె మరియు ఊపిరితిత్తుల శస్త్ర చికిత్స నిపుణులు

కర్నూలు. ఆంధ్రప్రదేశ్.ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలు చేయడం కొత్తకాదు.. అన్ని దేశాలలోనూ ఇవి అమలవుతుంటాయి,. అసలు ప్రజల సంక్షేమం కోసమే పారిశ్రామిక ప్రగతి ని ఆకాంక్షిస్తుంటాము,, యూరప్ లాంటి దేశాలు పారిశ్రామిక ప్రగతి సాధించింది ప్రజాసంక్షేమం కోసం.. ప్రజల కు ఇంత తిండి పెట్టేకి కనీసవసతులు కల్పించికే ప్రజాస్వామిక ప్రభుత్వాల ధ్యేయం...అయితే కూడు గుడ్డ ఇల్లు తో ఆకలి చావుల నివారణే కాకుండా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుదల ముఖ్యమే,, వ్యవసాయ ఆధారిత దేశంలో వ్యవసాయం మీదనే ఖర్చులు ప్రాజెక్టులు కని ఖర్చుపెడతారు,. పంట సబ్సిడీలు, ఋణమాఫీలు, ఉచిత విద్యుత్ లు, మినిమమ్ సపోర్టు ధర ఇవన్నీ అందులో భాగమే..కాని మారిన కాలంలో ప్రపంచీకరణ నేపథ్యంలో చదువు ఇంపార్టెన్స్ పెరిగింది.. మంచి చదువు చెప్పించి అత్యుత్తమ మానవవనరులు తయారు చేయడం ముఖ్యం అయింది,, పాతకాలంలో గురుకుల విద్యలో లెక్కలు నేర్వడం, సామాజికబాధ్యతలు నేర్చుకొని ఎవరిపనులు వాళ్ళు చేసుకొనేవారు..చేతివృత్తులే అంతరించి కుమ్మరి,కమ్మరి అంటే ఏమిటి అనే కాలానికి వచ్చేసాము.. ఉద్యోగ కల్పన పెద్ద సమస్య,. మనుగడకోసం పోరాటంలో ప్రతిభ ఉంటేనే కొలువులు,. అందుకోసం దేశదేశాలు సామాన్యులు వలస పోతున్నారు.. అందుకే చదువు కోసం చాలా పథకాలు పెడుతున్నారు...అలాగే న్యూక్లియార్ ఫ్యామిలీల రాక వల్ల, పాశ్చాత్య నాగరికత ప్రభావం వలన చాలామంది వృద్ధులు వంటరవుతుంటారు.. మహిళలు కూడా వితంతువులవుతుంటారు,, వీరికి ఆదరణ చూపడం అవసరమేగా అందుకే పథకాలు వచ్చాయి,,ఈ సంక్షేమ పథకాలు ఇవ్వడం ఒక ఎత్తయితే అవి సరిగ్గా అర్హులకు అందుతున్నాయా,.అనవసరంగా దొంగ లబ్ధి దారులున్నారా అనేది కనిపెట్టడం తలకు మించిన భారం,. పథాకాలలో ఉన్నోడు వదులు కోడు, ఎలాగోలా ఉండాలనుకుంటాడు,.లేనోడు పొందాలను కుంటాడు.. ఇద్దరికీ సంతృప్తి ఉండదు,. ఏదో ఒక క్రైటీరియా పెట్టి అర్హులకు అంద చేయాల, చాలా మంది ప్రజల డిమాండు అదే ఉంటాది,, ముందు నుయ్యి వెనుక గొయ్యి అంటే అదే... ప్రభుత్వం కు ఇబ్బంది కరం...సరిగ్గా ఇవి మానిటర్ చేసేకి, గ్రౌండు లెవల్ రియాలిటీ తెలుసుకునేకి ఉపయోగపడే ప్రోగ్రామే గడప గడపకు అనే ప్రోగ్రాం.. చాలామంది ప్రజాప్రతినిధులు ప్రజలలోకి వెళ్ళి సమస్య లను పరిష్కారం చేయడం అలవాటుండదు.,, వారి దగ్గరకు పోయే వారి సమస్యలు పరిష్కారం చేసేకే సతమవుతుంటారు.. సమస్యలు నిరంతర గంగాప్రవాహంలా వస్తూనే ఉంటాయి,, అవి తీర్చడం భగవంతునికే సాధ్యంకాదు..మనమెంత.. సమస్యలేని గడపే ఉండదు.. కాని గడప గడప కు వెళితేనే తీర్చగల సమస్యలు తెలుస్తాయి,.దాని ద్వారా లబ్దిదారుల ఏరివేత, కొత్త పథకాల రూపకల్పన జరుగుతుంది.. చాలా మంది ప్రజల ఆందోళన తగ్గుతుంది...సందట్లో సదేమియా లా దుష్ప్రచారాలు, గొడవలు, నిలదీయడం మామూలే.. మనుషులు పార్టీల వారిగా విడిపోయి గొడవ పడే యుద్ధవాతావరణంలో ఇవన్నీ సాధారణమే,,. అలా అని భయడితే ప్రజల నాడి తెలుసుకోవడం, సమస్యలు తెలుసుకోవడం జరగనే జరగదు... ఉలి దెబ్బకు భయపడితే శిల శిల్పంకాదు...పథకాల గమనం, లబ్ది, నష్టం అంచనా వేసుకోవడానికి ఇది ఉపయోగపడతాది... ప్రజలు నిజాయాతీగా సమస్యలు ప్రభుత్వం దృష్టి కి తెస్తే కొత్త పథకాలు రూపకల్పన చేయచ్చు..,.కావున గడప గడపకు ప్రభుత్వం అనేది పథకం మంచిదే.. మనం ఈర్ష్యాద్వేషాలతో అంటకాగకుండా మంచిగా ఉపయోగించుకోవచ్చు...పథకాలలో తప్పులు దొర్లడమూ సహజమే.. ప్రభుత్వము సరిదిద్దు కోవచ్చు,., రాజకీయ నాయకులకు మంచిదే..ప్రజలలో తమ బలాన్ని బలగాన్ని అంచనా చేసుకోవచ్చు... ప్రజాస్వామ్యం లో ఫీడ్ బాక్ చాలా ముఖ్యం.. అది డైరెక్టు గా ఫస్ట్ హాండు ఇన్ఫర్మేషన్ అయితే ఎంతో మంచిది గా,,, ఈ ప్రోగ్రాం వలన గడప గడపకు మంచి జరుగతాదని ఆశిద్దాం.,

# కళాకారులకు అన్యాయం చేసిన ప్రభుత్వం




కర్నూలు, మే 18: రాష్ట్ర ప్రభుత్వం కళాకారులకు తీరని అన్యాయం తలపెడుతోందని టీడీపీ కల్చరల్ విభాగం జిల్లా అధ్యక్షుడు హనుమంతరావు చౌదరి ఆరోపించారు. సమాజంలోని అన్ని వర్గాల వారికి అడగకపోయినా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు కానీ... కళలనే నమ్ముకుని జీవిస్తున్న రంగస్థల, నాటక రంగ కళాకారులను విస్మరించడం సరికాదన్నారు. రాష్ట్ర వికలాంగుల సంఘం కార్యదర్శి ఎల్లప్ప, నగర మహిళా కార్యదర్శి చంద్రకళ తదితరులతో కలసి జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమంతరావు చౌదరి మాట్లాడుతూ కళాకారులు రెండేళ్లకుపైగా కరోనా వల్ల ఎలాంటి ప్రదర్శనలు.. లేక.. ఆదుకునేవారు లేక అల్లాడిపోతున్నారని.. కనీసం ఇప్పటికీ పరిస్థితి

**అందరికీ పథకాలిస్తున్నారు.. కళాకారులకు మాత్రం ఏమీ లేదా?**
**మూడేళ్లుగా బకాయిలు 7కోట్లు కూడా ఇవ్వకుండా వేధిస్తున్నారు**
**టీడీపీ కల్చరల్ జిల్లా అధ్యక్షుడు హనుమంతరావు చౌదరి**

ఏమాత్రం మారలేదన్నారు. సంక్షేమ పథకాలు ఇచ్చే పరిస్థితి లేదని.. మరో వైపు పెండింగు బకాయిలు కూడా చెల్లించకుండా వేలాది మంది కళాకారులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ ప్రచారం కోసం పనిచేశారంటూ రాష్ట్ర వ్యాప్తంగా 7 కోట్లు, ఒక్క కర్నూలు జిల్లాలోనే 65 లక్షలు బకాయిలు ఇవ్వకుండా పెండిగులో పెట్టారని తెలిపారు. అధికారులు, ప్రభుత్వాలు నిర్దేశించిన పథకాల గురించి ప్రచారం చేసే కళాకారుల పట్ల ఇలా వివక్ష చూపి బకాయిలు చెల్లించకపోవడం వల్ల కళాకారులు ఆర్థికంగా చితికిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి సహాయం అందించకుండా మొండి చేయి చూపిస్తుండడాన్ని కళాకారులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని.. సహనాన్ని పరీక్షిస్తూ పోతే.. కళాకారులు తాడేపల్లి వచ్చి మీ ముఖ్యమంత్రి కార్యాలయం ఎదుటే కనువిప్పు కార్యక్రమాలు చేపట్టేందుకు వెనుకాడరని హనుమంతరావు చౌదరి హెచ్చరించారు. అలాగే తెలంగాణ ప్రభుత్వం చింతామణి నాటకాన్ని ఎక్కడైనా ప్రదర్శించుకునే అవకాశం కల్పిస్తుండగా.. ఏపీలో మాత్రం నిషేధం విధించడం సరికాదన్నారు. దశాబ్దాలుగా కళలనే నమ్ముకుని జీవిస్తూ.. మరో ఉపాధి వెతుక్కోలేని ఎంతో మంది పేద కళాకారులకు తీరని అన్యాయం జరుగుతోందన్నారు. కళాకారులను ఇబ్బందిపెట్టడం మానుకుని.. పెండింగు బకాయిలు చెల్లించడంతోపాటు.. కళాకారులను ఆదుకునే కార్యక్రమాలు చేపట్టాలని హనుమంతరావు చౌదరి డిమాండ్ చేశారు.

# దొర్నిపాడు లో పలు ప్రభుత్వ కార్యాలయాల తనిఖీలు

నంద్యాల దొర్నిపాడు మండల కేంద్రంలో తాసిల్దారు, ఎంపీడీవో, వ్యవసాయ శాఖ కార్యాలయాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంగన్వాడి కేంద్రం, గ్రామ సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సామూన్ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి జవాబుదారీతనంతో విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జిలాని సామూన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం దొర్నిపాడు మండల కేంద్రంలోని తాసిల్దారు, ఎంపీడీవో, వ్యవసాయ శాఖ కార్యాలయాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంగన్వాడి కేంద్రం, గ్రామ సచివాలయాలను సుడిగాలి పర్యటన చేస్తూ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విధినిర్వహణలో అలసత్వం వహించినా, నిర్దేశించిన నిర్దేశిత లక్ష్యాన్ని సాధించడంలో విఫలమైనా, నిర్ణీత గడువులోపు పూర్తి చేయకపోయినా సంబంధిత అధికారును ఎవరినీ ఉపేక్షించేది లేదని కలెక్టర్ స్పష్టం చేశారు.తొలుత దొర్నిపాడు మండల తాసిల్దార్ కార్యాలయాన్ని సందర్శిస్తూ సిబ్బంది హాజరు పట్టికను కలెక్టర్ పరిశీలించారు. స్పందన ఫిర్యాదులకు సంబంధించి ఎన్ని పెండింగ్ లో వున్నాయని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శిస్తూ మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ కూలీల సంఖ్య...పనులు జరుగుతున్న వివరాలు, జనజీవన్ మిషన్ కింద చేపడుతున్న పనులు, ప్రయారిటీ బిల్డింగులు, చెత్త సంపద తయారీ కేంద్రాలు, పారిశుద్ధ్యం, త్రాగునీటి సరఫరా తదితర అంశాలపై కలెక్టర్ ఆరా తీస్తూ ఎంపీడీవో నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని సందర్శిస్తూ ఇటీవల కురిసిన అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న పంటల నష్టాన్ని అంచనా వేసి ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేస్తూ నెలలో ఎన్ని ప్రసవాలు జరిగాయని... ఎంత మంది ఆశా వర్కర్లు పనిచేస్తున్నారని... అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయా అని అడిగారు .అనంతరం దొర్నిపాడు గ్రామ సచివాలయ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేస్తూ సిబ్బంది హాజరు పట్టిక, ఉద్యోగుల మూవ్మెంట్ రిజిస్టర్, సంక్షేమ పథకాల క్యాలెండర్, ఎస్ఎల్ఏ గడువులోగా ప్రజా సమస్యల పరిష్కార చర్యల నివేదిక తదితర రికార్డులను పరిశీలించారు. ఆన్లైన్ అటెండెన్స్ పరిశీలిస్తూ సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు.సచివాలయ సిబ్బంది ప్రజలకు అందిస్తున్న సర్వీసులపై వివరాలను క్షుణ్ణంగా అడిగి తెలుసుకుంటూ ఏ ఒక్కటి పెండింగ్ లేకుండా నిర్ణీత గడువులోగా సర్వీసులు అందించాలని కలెక్టర్ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు.

# బెంగళూరు కేంద్రంగా డ్రగ్స్ సరఫరా చేస్తున్న ముఠాని గుట్టు రట్టు చేసిన కర్నూలు పోలీసులు.

కర్నూలుమే 18 :-బెంగళూరు నుండి హైదరాబాద్ కు డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్టు కర్నూలు పోలీసులకు అందిన సమాచారం మేరకు షేక్ సానుల్లా అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించి కర్నూలు తాలుకా పోలీసు స్టేషన్ లో క్రైమ్ నెంబర్ 306/2022 జ/బ 22 ఎ ఔఆఖా ఢఇబి 1985 క్రింద కేసు నమోదు చేయడం జరిగింది. షేక్ సానుల్లా బెంగుళూర్ లో రిజ్వాన్ అనే వ్యక్తి ద్వారా డ్రగ్స్ కొనుగోలు చేసి హైదరాబాద్ లో నరేంద్ర సింగ్, మగ్బుల్, తరుణ్ అనే ముగ్గురు వ్యక్తులకు డ్రగ్స్ సరఫరా చేయడానికి వెళ్తున్నట్టు తెలిపాడు. షేక్ సానుల్లా ఇచ్చిన సమచారంతో రిజ్వాన్ ను అదుపులోకి తీసుకొని విచారించడం జరిగింది. విచారణలో విజయవాడ లో మరో ఇద్దరు వ్యక్తులకు కూడా రిజ్వాన్ డ్రగ్స్ అమ్మినట్లు విచారణ లో వెల్లడి అయినది. విజయవాడలో యశ్వంత్ రెడ్డి , ఏకేశ్వరరెడ్డి లను అదుపులోకి తీసుకున్న పోలీసులు.హైదరాబాద్ లో నరేంద్ర సింగ్, మగ్బుల్, తరుణ్ అనే ముగ్గురు వ్యక్తులను కూడా పోలీసులు అదుపులోకి తీసుకోవడం జరిగింది.

---

# ఈ వారం ఓటీటీ ప్రియులకు మాస్ జాతరే




మళ్లీ ఈ వారం ఓటీటీలో సినిమాల జాతర ప్రారంభం కాబోతోంది. థియేటర్లలో ప్రేక్షకుల్ని ఆకట్టుకున్న భారీ చిత్రాలతో పాటు చిన్న సినిమాలు వెబ్ సిరీస్ లు కూడా ఈ వారం ఓటీటీలో సందడి కి రెడీ అవుతున్నాయి. ఇందులో పాన్ ఇండియా వైడ్ గా బాక్సాఫీస్ వద్ద హల్ చల్ చేసిన ట్రిపుల్ ఆర్ కూడా వుండటం విశేషం. అంతే కాకుండా ఒకే రోజు రెండు ఓటీటీ ప్లాట్ ఫామ్ లలో రామ్ చరణ్ నటించిన ట్రిపుల్ ఆర్ ఆచార్య స్ట్రీమింగ్ కానుండం విశేషం.రెండున్నరేళ్ల విరామం తరువాత ప్రేక్షకుల ముందుకొచ్చిన ఎపిక్ యాక్షన్ డ్రామా -ట్రిపుల్ ఆర్-. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ యంగ్ టైగర్ ఎన్టీఆర్ తొలిసారి కలిసి నటించారు. లెజెండరీ ఫ్రీడమ్ ఫైటర్స్ అల్లూరి సీతారామరాజు కొమురం భీం ల ఫిక్షనల్ స్టోరీగా ఈ మూవీని దర్శకుడు రాజమౌళి అత్యంత భారీ స్థాయిలో తెరకెక్కించారు. ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లని రాబట్టి రికార్డులు సృష్టించిన ఈ చిత్రం మే 20న ఓటీటీ దిగ్గజం జీ5 లో స్ట్రీమింగ్ కాబోతోంది. అయితే అన్ని సినిమాల తరహాలో సాధారణ స్ట్రీమింగ్ కాకుండా పే పర్ వ్యూ అనే పద్ధతిలో ఈ మూవీని స్ట్రీ మింగ్ చేయబోతున్నారు.ఈ మూవీ తరువాత అదే రోజు ఓటీటీ ప్రేక్షకుల ముందుకొస్తున్న మూవీ -ఆచార్య-. మెగాస్టార్ చిరంజీవి మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ తొలిసారి కలిసి నటించిన యాక్షన్ డ్రామా ఇది. స్టార్ డైరెక్టర్ కొరటలా శివ అత్యంత భారీ స్థాయిలో తెరకెక్కించిన చిత్రమిది. చిరు నుంచి దాదాపు రెండేళ్ల విరామం తరువాత వచ్చిన ఈ ఇచత్రం అభిమానులతో పాటు సగటు ప్రేక్షకుల్ని తీవ్ర నిరాశకు గురిచేసింది. చిరు కెరీర్లోనే అత్యంత డిజాస్టర్ గా నిలిచింది. ఈ మూవీ మే 20న అమెజాన్ ప్రైమ్ లో స్ట్రీమింగ్ కాబోతోంది.ఇక మలయాళ సూపర్ స్టార్ మోహన్ లాల్ నటించిన -12బిష్ట్ర మ్యాన్- ఓటీటీలో నేరుగా విడుదల కాబోతోంది. ఇటీవల మోహన్ లాల్ నటించిన చాలా వరకు చిత్రాలు థియేటర్లలో కాకుండా ఓటీటీలలో విడుదలై సంచలన విజయాల్ని సాధించాయి. -12బిష్ట్ర మ్యాన్-కూడా అదే స్థాయిలో ఓటీటీలో రిలీజ్ అవుతుండటం గమనార్హం. దృశ్యం దృశ్యం 2 చిత్రాల దర్శకుడు జీతు జోసెఫ్ తెరకెక్కించిన సినిమా ఇది. మిస్టరీ థ్రిల్లర్ గా రూపొందిన ఈ మూవీ మే 20న డిస్నీ ప్లస్ హాట్ స్టార్ లో స్ట్రీమింగ్ కాబోతోంది.యంగ్ హీరో శ్రీవిష్ణు కేథరిన్ జంటగా నటించిన చిత్రం -భళా తందనాన-. చైతన్య దంతులూరి డైరెక్ట్ చేసిన ఈ మూవీ రిలీజైన రెండు వారాల్లోనే ఓటీటీలో స్ట్రిమింగ్ అవుతోంది. క్రైమ్ థ్రిల్లర్ గా కూపొందిన ఈ మూవీ కూడా మే 20న డిస్నీ ప్లస్ హాట్ స్టార్ లో స్ట్రీమింగ్ కాబోతోంది. మే 6న విడుదలైన ఈ మూవీ కేవలం రెండు వారాల్లోనే ఓటీటీలోకి రాబోతోంది. లాక్ డౌన్ సమయంలో విడుదలై నవ్వులు పూయించిన వెబ్ సిరీస్ -పంచాయత్-. దీనికి సీక్వెల్ గా -పంచాయత్ 2- ని రూపొందించారు. నీనా గుప్తా జితేంద్ర కుమార్ రఘు వీర్ యాదవ్ జితేంద్ర కుమార్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు.దీపక్ మిశ్ర దర్శకత్వం వహించిన ఈ వెబ్ డ్రామా మే 20ర అమెజాన్ ప్రైమ్ లో విడుదలవుతోంది. ఇదిలా వుంటే ఇదే మే 20న థియేటర్లలో నాలుగు చిత్రాలు రిలీజ్ అవుతున్నాయి. రాజశేఖర్ -శేఖర్- సంపూర్ణేష్ బాబూ -ధగడ్ సాంబా- కంగనా రనౌత్ -ధాకడ్- కార్తీక్ ఆర్యన్ -భూల్ బులాయా 2- వంటి చిత్రాలు విడుదలవుతున్నాయి.

# సర్కారు వారి ఆల్ టైమ్ రికార్డ్.. 4 డేస్ వరల్డ్ వైడ్ కలెక్షన్స్..!

సూపర్ స్టార్ మహేష్ బాబు నటించిన "సర్కారు వారి పాట" సినిమా నాలుగు రోజుల ఫస్ట్ వీకెండ్ ను పూర్తి చేసుకుంది. పరశురామ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ మూవీ.. టాక్ తో సంబంధం లేకుండా బాక్సాఫీస్ వసూళ్ళు రాబడుతోంది. మూడో రోజు నుంచి ఈ సినిమా కలెక్షన్లలో గ్రోత్ కనిపించగా..




నాల్గవ రోజు (ఆదివారం) తెలుగు రాష్ట్రాల్లో 14.04 కోట్ల షేర్ ను రాబట్టినట్లు నిర్మాతలు ప్రకటించారు.ఓవర్ సీస్ లో మహేష్ బాబు కు మంచి మార్కెట్ ఉందనే సంగతి తెలిసిందే. ఇప్పుడు 'సర్కారు వారి పాట' సినిమా ఈ విషయాన్ని మరోసారి రుజువు చేసింది. యూఎస్ఏలో ఈ మూవీ ప్రీమియర్స్ మరియు నాలుగో రోజు వసూళ్ళు కలుపుకొని 2 మిలియన్ డాలర్ల మార్కును క్రాస్ చేసింది.ఇప్పటి వరకు 'సర్కారు వారి పాట' సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ. 95.08 కోట్ల షేర్ రాబట్టినట్లు నిర్మాతలు ప్రకటించారు. ఇది ఒక ప్రాంతీయ చిత్రానికి ఆల్ టైమ్ రికార్డ్ గా పేర్కొనబడింది. సోమవారంతో ఈ మూవీ రూ. 100 కోట్ల షేర్ ను క్రాస్ చేస్తుందని చెబుతున్నారు.ూఎఖ చిత్రం ఓవర్సీస్ మరియు డొమెస్టిక్ లో అనేక ఇతర రికార్డులను నమోదు చేసిందని తెలుస్తోంది. 95 కోట్లకు పైగా షేర్ తో.. కేవలం 4 రోజుల్లోనే అన్ని సినిమాల మొదటి వారం కలెక్షన్లను క్రాస్ చేసింది. అలానే అత్యధికంగా 1.5ఓ+ ఓవర్సీస్ కలెక్షన్స్ (8 సినిమాలు) కలిగి ఉన్న ఒకే ఒక్క సౌత్ ఇండియన్ హీరోగా మహేశ్ నిలిచారు.'సర్కారు వారి పాట' మహేష్ బాబుకి ఆర్టీసీ క్రాస్ రోడ్స్ లో 1 కోటికి పైగా షేర్ వసూలు చేసిన 10వ చిత్రం. అంతేకాదు మహేష్ కెరీర్ లో 2 మిలియన్లకు పైగా వసూలు చేసిన నాలుగో సినిమాగా నిలిచింది. ప్రభాస్ పాన్ ఇండియా సినిమాలతో.. రజినీకాంత్ ద్విభాషా చిత్రాలతో ఈ ఘనత సాధించగా.. మహేశ్ కేవలం రీజనల్ మూవీతో రికార్డ్ క్రియేట్ చేయడం గమనార్హం.మేకర్స్ ప్రకటించిన లెక్కల ప్రకారం ూఎఖ 4 రోజుల షేర్ల వివరాలు:నైజాం - 29.61 కోట్లుసీడెడ్ - 9.81 కోట్లుఉత్తరాంధ్ర - 9.36 కోట్లుగుంటూరు - 7.57 కోట్లుతూర్పు - 6.51 కోట్లుకృష్ణ - 5.4 కోట్లువెస్ట్ - 4.41 కోట్లునెల్లూరు - 2.91 కోట్లుమొత్తం (ఁఖ/ఉ) - 75.58 కోట్లుకర్ణాటక+ఖీూఎ - 7.6 కోట్లుఓవర్సీస్ - 11.9 కోట్లుమొత్తం వరల్డ్ వైడ్ షేర్ - 95.08 కోట్లుకాగా 'సర్కారు వారి పాట' చిత్రంలో మహేశ్ బాబు సరసన కీర్తి సురేష్ తొలిసారిగా హీరోయిన్ గా నటించింది. సముద్రఖని - వెన్నెల కిషోర్ - నదియా - సుబ్బరాజు తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఎస్ఎస్ థమన్ సంగీతం సమకూర్చారు. ఆర్. మది సినిమాటోగ్రఫీ అందించగా.. ఏఎస్ ప్రకాశ్ ఆర్ట్ డైరెక్టర్ గా వర్క్ చేశారు.మైత్రీ మూవీ మేకర్స్ - జీఎంబీ ఎంటర్టైన్మెంట్స్ - 14 రీల్స్ ప్లస్ బ్యానర్లు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించాయి. నవీన్ యెర్నేని - వై. రవిశంకర్ - రామ్ ఆచంట - గోపీచంద్ ఆచంట నిర్మాతలు. సర్కారు వారి సక్సెస్ సెలబ్రేషన్స్ లో భాగంగా ఇవాళ సాయంత్రం కర్నూల్ లో ఈవెంట్ నిర్వహించనున్నారు. దీనికి మహేష్ బాబుతో పాటుగా మొత్తం కోర్ టీం హాజరు కానుంది.

# రిటైర్మెంట్ ప్రకటించిన న్యూజిలాండ్ క్రికెటర్.. అరుదైన రికార్డు ఆమె సొంతం!



న్యూజిలాండ్ మహిళా క్రికెటర్ కేటీ మార్టిన్ ఆటకు వీడ్కోలు పలికారు. అంతర్జాతీయ క్రికెట్కు గుడ్ బై చెబుతున్నట్లు ఆమె బుధవారం ప్రకటించారు. అన్ని ఫార్మాట్ల నుంచి వైదొలగుతున్నట్లు వెల్లడించారు. కాగా 2003లో ఇంటర్నేషనల్ క్రికెట్లో అడుగుపెట్టిన కేటీ.. వైట్ఫెర్న్స్ వికెట్ కీపర్ బ్యాటర్గా సేవలు అందించారు. పందొమ్మిదేళ్ల తన కెరీర్లో మొత్తంగా 103 వన్డేలు, 95 టీ20 మ్యాచ్లు, ఒక టెస్టు ఆడారు. ఐసీసీ మహిళా వన్డే ప్రపంచకప్-2022లో భాగంగా మార్చిలో పాకిస్తాన్తో జరిగిన మ్యాచ్ కేటీకి చివరిది. ఇందులో ఆమె 26 బంతుల్లో 30 పరుగులతో అజేయంగా నిలిచారు. ఇక సుదీర్ఘకాలంగా వైట్ఫెర్న్స్ విజయాల్లో తన వంతు పాత్ర పోషించిన కేటీ మూడు ఫార్మాట్లలో కలిపి 2900 పరగులు చేశారు. ఇందులో 11 అర్ధ శతకాలు ఉన్నాయి. అంతర్జాతీయ క్రికెట్లో కేటీ అత్యధిక స్కోరు 81.ఇక దేశవాళీ వన్డే కెరీర్లో 169 మ్యాచ్లు ఆడిన కేటీ.. ఈ ఘనత సాధించిన ఏకైక ప్లేయర్(న్యూజిలాండ్ మెన్, వుమెన్ క్రికెట్)గా నిలిచారు. రిటైర్మెంట్ సందర్భంగా క్రిక్బజ్తో మాట్లాడిన కేటీ.. "అద్భుతమైన అనుభవం. ఈ సుదీర్ఘ ప్రయాణంలో నాకు తోడుగా నిలిచిన నా సహచర ఆటగాళ్లు, కోచ్లు, అభిమానులు, ప్రత్యర్థి జట్ల ప్లేయర్లు.. అందరికీ ధన్యవాదాలు. క్రికెట్ నాకు జీవితాన్నిచ్చింది. దేశానికి ప్రాతినిథ్యం వహించాలన్న నా కలను నిజం చేసుకున్నాను. ఈ నిర్ణయం తీసుకోవడం కష్టమే. కానీ తప్పదు" అని పేర్కొన్నారు.




---

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**